సౌమనస్యము

డా॥ సూరం శ్రీనివాసులు

soumanasyam
padya kavyam by
suram srinivasulu

మానవ హృదయంలోని వైమనస్యాన్ని దూరం చేసి, సౌమనస్యాన్ని సమకూర్చే సరసమైన సప్తదళముల సౌమనస్యమిది

-కరుణశ్రీ

చివరంటా వస్తుకళను ప్రదర్శిస్తూనే చిట్టచివర ఒక చిన్న మాటతో గుండె పిండేసే భావకళను ప్రదర్శించడం సూరం వారి పద్యరచనా నైపుణ్యానికి ఒక ఉదాహరణ - ఇది తిక్కనగారి పద్ధతి

-మహాసహస్రావధాని
గరికపాటి నరసింహారావు

సంగచ్ఛధ్వం
డా॥సూరం అభినందన సంఘం ప్రచురణ

సౌమనస్యము

డా॥ సూరం శ్రీనివాసులు

సంగచ్ఛధ్వం
డా॥ సూరం అభినందన సంఘం
చీరాల

సౌమనస్యము (పద్యకావ్యం)
డా॥ సూరం శ్రీనివాసులు

తొలి ముద్రణ: 1980
మలి ముద్రణ: జూన్ 2011 (షష్టిపూర్తి సందర్భంగా)
తృతీయ ముద్రణ: మార్చ్ 2021 (ఈ-ముద్రణ / పీడీయఫ్)

సర్వస్వామ్యములు కవివి

ముఖచిత్రం, పుస్తకరూపాలంకరణ
రమణజీవి

ప్రచురణ
సంగచ్ఛధ్వం
డా॥ సూరం అభినందన సంఘం
చీరాల

ప్రతులకు
డా॥ సూరం శ్రీనివాసులు
ఫో: 9440242348
e-mail: srinivasulu.suram@gmail.com

వెల: రూ.30/-

మన్నన

'సంగచ్ఛధ్వం' డా॥ సూరం శ్రీనివాసులు గారి ఉద్యోగ విరమణ సందర్భంగా 2009లో ఏర్పడిన అభినందన సంఘం. ఈ సంఘం అప్పుడు ప్రచురించిన 'విద్మహే - సూరం శ్రీనివాస సౌమనస్యం' యస్‌యస్ గారి సాహిత్య వ్యక్తిత్వాలకు నిలువెత్తు అద్దంగా నిలిచి సహృదయుల మన్ననలు పొందింది. ఆ ప్రోత్సాహంతో సూరం మాష్టారి సౌమనస్య కావ్యం కూడా పునర్ముద్రించాలని సంకల్పించాము అందుకు మాష్టారి షష్టి పూర్తిని ఒక నెపంగా యెంచుకున్నాం.

'సౌమనస్యం' మాష్టారి తొలిబిడ్డ. దాన్నెత్తుకుని హృదయానికి హత్తుకొని మేమందరం ఆనందించాం. కాల్పనికార్థంలో, ఆధ్యాత్మికార్థంలో దానిలోని జీవన తాత్వికతని పదుగురూ మెచ్చుకున్నారు. ఆ సుమసౌరభాన్ని మళ్ళీ మీతో పంచుకోవాలని శ్రీనివాసులు మాష్టారి శిష్యులం భావించాం. ఆ భావన కార్యరూపం దాల్చి యిదిగో మీ ముందు యిలా నిలిచింది.

మా యీ ప్రయత్నంలో సహకరించిన వాళ్ళెందరో ఉన్నారు.

అడగ్గానే అర్థవంతమైన ముందుమాట రాసిన ఆత్మీయ మిత్రుడు గరికపాటికి, పుస్తక రూపకల్పన చేసి అందమైన ముఖచిత్రాన్నిచ్చిన రమణ జీవికి, ముద్రించిన ఆకృతి ప్రింటర్స్‌కి, మాకు అన్ని విధాలా దారి చూపుతూ తోడ్పడిన సూరం మాష్టారి మిత్రులు, సహచరులు అభిమానులకు, తూమాటి సంజీవరావు, వి.నాగరాజ్యలక్ష్మి, జె. నాగేశ్వరరావు, కె.కృష్ణకుమారి, సిహెచ్.పి.సత్యనారాయణ, శ్యామలానంద ప్రసాద్, కొసరాజు రాజ్యలక్ష్మి, పి.బి.డి.వి.ప్రసాద్, ఎస్.ఎ.టి.కె. తాతాచార్య, అమరేశ్వరి, సిహెచ్.జ్యోతి, రాంబాబు, హరిహరపంత్, కృష్ణకిషోర్, బలే సుబ్రహ్మణ్యం, సోమయాజులు, పి.సురేష్, స్వర్ణ కుమారి, నిమ్మరాజు శ్రీనివాసమూర్తి, సోమేశ్వరరావు, అగ్నిహోత్రం మారుతీ శ్రీనివాస్, అప్పలాచార్య, నల్లమోతు శ్రీనివాస్ మొదలయిన మాష్టారి అంతేవాసులందరికీ కృతజ్ఞతలు

అభిమానంతో

ఎ.కె.ప్రభాకర్

లీలా పత్రాలు

మరో ముద్రణ	:	vi
చూరున జారిన చుక్కలపూలు *డా॥ గరికపాటి నరసింహారావు*	:	vii
తొలిముద్రణ ముందుమాట *డా॥ టి.వెంకయ్య*	:	xi
నానుడి.. *సూరం శ్రీనివాసులు*	:	xiii
భావనా శ్రీనివాసము *కరుణశ్రీ*	:	xv
వికృతి	:	1
ప్రకృతి	:	6
సంఘర్షణ	:	11
స్పందన	:	19
సంవాదము	:	26
చేతన	:	40
దీప్తి	:	48
సుమనస్కుని పయనం	:	59

సౌమనస్యము మరో ముద్రణ

సౌమనస్యాన్ని తొలుతగా ప్రచురించి మూడు దశాబ్దాలు గడచిపోయాయి. ముద్రించిన ప్రతులు ఎప్పుడో చెల్లిపోయాయి. ఆనాటి కరుణశ్రీతో పాటు కళాపిపాసువులయిన సంజీవదేవ్ వంటి ప్రముఖు లెందరో దాన్ని చదివి చూసి, సంతోషించి, ప్రోత్సహించారు. అడపా దడపా, అప్పుడప్పుడు, ఒకరో ఇద్దరో, ఆప్తులో అపరిచితులో సౌమనస్యం ప్రతి కావాలని అడగటం కూడా కద్దు. కానీ అందుబాటులో లేవు.

సౌమనస్యాన్ని ఆర్తితో చదివిన పాఠకులూ ఉన్నారు. అన్యమనస్కంగా సమీక్షించిన పత్రికా సమీక్షకులూ ఉన్నారు. ఎవరి ప్రేమ వారిది.

సౌమనస్యానికి ఒక తాత్త్విక భూమిక ప్రేరణ. తాత్త్విక దృష్టి లేని కవి లేదా కవిత సమాజానికి ఎదుగును కానీ ఒదుగును కానీ ఇవ్వలేవు. ముప్పయి రెండేళ్ళు గడిచినా నా అప్పటి ఆలోచనలకు, ఇప్పటి ఆలోచనలకూ కొంచెం కూడా తేడా లేదు. అందుకే నాదిగా సౌమనస్యాన్ని మళ్ళీ ముద్రించటానికి సిద్ధపడటం...

నా విద్యార్థులుగా చెలామణి కావటానికి ముచ్చటపడే నా పూర్వ విద్యార్థులు డా॥ఆళ్ళ కోటి ప్రభాకర్ నేతృత్వంలో దీనిని 'సంగచ్ఛధ్వం' తరపున మళ్ళీ ముద్రిస్తున్నారు. వారికి అభినందనలు.

పాఠకులకు చిన్న మనవి. సౌమనస్యాన్ని చదివి ఆనందిస్తారో లేదో అది మీ అభిరుచికి సంబంధించినది. కొద్దిసేపు ఆలోచించండి. అది కవి ఆశించినది. నమస్సులతో...

- డా॥ సూరం శ్రీనివాసులు

చూరున జారిన చుక్కల పూలు

కాల మహాస్వరూపునకు కమ్మని స్వాగతమీయ, పక్షి బృం
దాల ప్రపంచయాత్రకు పతాకము నూపగ, కొమ్మ కొమ్మకున్
తేలిన సౌమ్యహాసముల తీయని చేతుల పల్కరింపగా
రాలిన జాజిపూల వివరాలు కనుంగొని నిద్రలేచితిన్

అంటూ రాలిన జాజిపూల వివరాల కోసం మాలాంటి కవులం 'సాగరఘోష' వంటి కావ్యాలలో తాపత్రయపడ్డామంటే ఆ ప్రేరణ 'సౌమనస్యం' వంటి కావ్యాలనుండి, సూరం శ్రీనివాసులు గారి వంటి కవుల నుండి పొందిందే. కారణం ఇదుగో ఇలాంటి పద్యాలే.

'తెల్లవారి నంతనెల్ల తోటయు మేలు
కొనియె; పూవు-తావి-కొమ్మ-రెమ్మ-
నేల-నింగి-తీవె-గాలి మరేవేవో
కాని యా సుమమ్ము కన్నుమూసె'

ఇది సౌమనస్యం కావ్యంలో సిగపూవు లాంటి పద్యం. చివరంటా వస్తుకళను ప్రదర్శిస్తూనే చిట్టచివర ఒక చిన్న మాటతో గుండె పిండేసే భావకళను ప్రదర్శించడం అంటే ఇదే. ఇది తిక్కనగారి పద్ధతి.

'వెన్నెల కుప్పల' ఆట తెలుగునాట ఇప్పుడు 40 ఏళ్లు దాటిన వాళ్లందరికీ తెలుసు. వెన్నెల్లో ఇసుక కుప్పలు పొడుగ్గా పేర్చి ఆడుతూ ఆ ఇసుక కుప్పల్ని వెన్నెల కుప్పలుగా భావించే గడసరులు తెలుగింటి ఆడపిల్లలు. అలా వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలు తిలక్ కవిత్వంలో అక్షరాలుగా మారితే సూరం వారి ఊహల్లో చీకటి ఆకాశానికి వెన్నెల వెలుగులిచ్చిన విశాలహృదయులుగా ప్రకాశించారు. ఇదిగో ఈ పద్యం సాక్ష్యం .

'వెన్నెలల కుప్పలాటలోఁ బిల్లవాండ్రు
నన్ని కుప్పలఁ జెఱపిన యంత మింట
వెలుగు నల్దిక్కులన్ సాగి విరిసెనేమొ

కాని యచ్చోట నా యాట కలుగుటెట్లు?'

వీళ్లంటే ఉదారంగా కుప్పలు చెరిపేని వెన్నెలల్ని ఆకాశానికి అందించగలరు కానీ ఆక్కడ ఆ ఆకాశంలో ఆడుకొందుకు ఆడపిల్ల లేరీ? అని ప్రశ్నించే ఈ పద్యం చివరి ఉక్తి చమత్కారం ఉందే-

ఆదిగో అదే మాలాంటి అభిమానుల్ని సూరంవారి చూరు పట్టుకు వ్రేలాడేలా చేస్తుంది. ఏ 'విజయవిలాసం'లోని 'చంద్రప్రస్తర సౌధఖేలన' పద్యంలోంచో అమ్మాయిల్ని బ్రతిమాలి తీసుకువచ్చి అక్కడ ఆడించవలసిందే. ఇదే శ్రీనివాసులుగారి పద్యాలతో సమస్య

కరుణ ఒకోసారి కర్తవ్యం నుండి దూరం చేస్తుంది. ఎప్పటికో మేలుకుని కర్తవ్యం నిర్వహిద్దామనుకుంటే అప్పటికి కరుణ కరడుగట్టుకుపోతుంది. ఇదీ ఈ కావ్యేతివృత్తానికి మూలమైన ఆలోచన. చదవండి. మీకే తెలుస్తుంది.

ఒక కావ్య నాయకుని శారీరక, మానసిక సౌందర్యాలు వర్ణించిన వారిని చాలామందిని చూశాం కానీ ఈ కావ్యంలో కవి తన కథానాయకుని ఆత్మ సౌందర్యాన్ని వర్ణించారు. మన్మథుడు అతనితో సరిపోలాలంటే తూపుల్ని చూపులుగా మార్చుకోవాలట. సూర్యుడు అతనితో సాటి రావాలనుకొంటే దోషం(రాత్రి) చూడగానే పారిపోయే స్వభావం మార్చుకోవాలట. స్త్రీలను ఆకర్షించడంలో ఇతనితో సమానం కావాలనుకొంటే చంద్రుడు పద్మాలను కూడా వికసింపజేసి తీరాలట. ఇదంతా ఒక ఎత్తు. చివరలో పేల్చిన టపాకాయ ఒక ఎత్తు. మొత్తం మీద ఎవరు అతనితో జత కట్టాలన్నా 'స్వస్వనియత ప్రవృత్తులి వదులుకోవలసిందే' నట. ఇది అపూర్వమైన ఆధ్యాత్మిక తత్త్వం. జీవుడు ఎప్పటికైనా తన నామరూపాలను, తగిలించుకొన్న బంధాలను వదిలించుకొంటే కానీ దేవుడిలో కలవలేడు. అహంకార మమకారాలే మన ప్రవృత్తుల్ని, రాగద్వేషాలను నిర్ణయిస్తాయి. అవి వీడిపోకుండా జీవాత్మ పరమాత్మల సంయోగం సాధ్యమే కాదనే అద్వైతతత్త్వాన్ని నాయక లక్షణాలలో నిరూపించిన తాత్త్విక కవి శ్రీనివాసులుగారు.

మాటలో మాటగా అక్కడక్కడ చెప్పిన నిత్య సత్యాలు ఈ కావ్యపాయసంలో శ్రీమతి వలపులు (కిస్‌మిస్‌లు)

కొన్నింటినిఁ బ్రతి నిత్యముఁ
గొన్నింటిని నప్పుడపుడు గొన్నిటినన్న
న్నెన్నడు వాడక పేటిక
నున్నది యని తృప్తి పడుట యున్నది జగతిన్

ఈ పద్యం కావ్యంలో ఏ సందర్భంలో చెప్పినా మనం వాడకపోయినా అక్షరమాలలో భద్రపరచుకొని సంతోషించవలసిన బండి ఱ, అరసున్న, దంత్య చకార జకారాలు, ఋ, ౠ మొ॥న వాటికి చక్కగా అన్వయిస్తుంది. ఎప్పుడు వాడే చీపురు కట్టకి, ఎన్నడూ కట్టని చీరలకీ ఎలాగూ వర్తిస్తుంది.

మరో అద్భుతమైన తాత్త్విక వాక్యం

'పదములకుఁ బుట్టువులు నిచ్చు పెదవులైన
మధ్యగాఁ జీలి విడిపోయి మసలుచుండు'

అనే పద్యం రూపంలో ఉంది. ఇప్పటి మన రాష్ట్ర పరిస్థితులకి ఈ మాట చక్కగా అన్వయిస్తుందేమో! ఆలోచించి చూడండి.

ఇంతకూ నేనుదహరించినవన్నీ సూరంవారి చూరునుండి జారిన చినుకులే. అసలైన వానలో తడియాలంటే కావ్య గేహంలో ప్రవేశించవలసిందే!

భాగ్యనగరం   **డా॥గరికపాటి నరసింహారావు**

22-5-11

ముందుమాట *

సాహితీ మిత్రుల సహకారంతో సాహిత్య కార్యక్రమాల నిర్వహణ కోసం పొన్నూరులో "చైతన్య భారతి" అనే పేరుతో ఒక సంస్థను స్థాపించుకోవడం జరిగింది. అవకాశం లభించినప్పుడల్లా సాహిత్య ప్రసంగాలు ఏర్పాటు చేయడమే కాక కవితారీతులు ప్రతిబింబింపజేస్తూ సామాజిక స్పృహ కల రచనలను ప్రోత్సహించే ఆశయం కూడా ఈ సంస్థకుంది. అటువంటి కార్యక్రమాలవల్ల కవి, వ్యక్తి, సమాజం అనే మూడంశాలకు ప్రాధాన్యం ఇవ్వటం సాధ్యమవుతుందని, తద్వారా సాహిత్య ప్రయోజనాన్ని అందుబాట్లోకి తెచ్చుకోవడం కూడా వీలవుతుందని చైతన్య భారతి విశ్వసిస్తోంది

ఈ సంస్థ పక్షాన మొదటి ప్రచురణగా శ్రీసూరం శ్రీనివాసులు గారు రచించిన “సౌమనస్య” మనే పద్య కావ్యాన్ని సాహిత్య బంధువులకు అందిస్తున్నాం

మానవ ప్రవృత్తికి అద్దపట్టే యిటువంటి రచనలు నవ్యాంధ్ర సాహిత్యంలో వెలువడుట ఎంతో అవసరమని భావిస్తున్నాం. సౌమనస్యాన్ని రసహృదయంతో పాఠకలోకం స్వీకరించగలదని ఆశిస్తున్నాం

“జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః”

డా॥ టి. వెంకయ్య

అధ్యక్షులు, చైతన్య భారతి

** మొదటి ముద్రణ (1980) సందర్భంగా ప్రకాశకుల పలుకు*

నా నుడి...*

ప్రాణి పుట్టుక మొదలు మరణం వరకు సాగే విచిత్ర విన్యాసాలకు ఆలంబనమైనదే కాలం. అది చాలా స్వల్పం. ఆ స్వల్ప కాలంలో ఒక్క క్షణాన్నయినా తనదిగా నిలుపుకొని, మిగిలిన దాన్ని పదిమందికి పంచటం జీవిత సార్థక్యానికి ప్రథమ సోపానం. ప్రకృతిలా సుదూర గమ్యాలను చేరలేకపోయినా అది చూపిన బాటలో నడవటం హృదయ చైతన్యానికి సంకేతం. ఆ పరమార్థాన్ని అవగతం చేసుకోవాలని చేసిన ప్రయత్నమే ఈ కావ్యం .

“ఈ కుసుమాన్ని త్రుంచి అందాన్ని హత్య చేయలేని ఒక యువకుడు, ఎవరూత్రుంచక నా బ్రతుక్కేం ఫలం? అని కుసుమం, ఈ భావాల్లో ఏది సమర్థనీయం." అని ప్రశ్నించి ఈ కావ్య రచనకు ప్రేరణ కల్గించిన నా పూర్వ విద్యార్థినులు, చిరంజీవినులు వి. నాగరాజ్యలక్ష్మి ఎమ్.ఎ, సత్యవతి ఎమ్.ఎలకు నా ఆశీస్సులు. వారి విచికిత్సకు సమాధానమే ఈ కావ్యం.

“భావనా శ్రీనివాసము”తో నన్ను, నా కావ్యాన్ని ఆశీర్వదించిన "కరుణశ్రీ" గార్కి,

సౌమనస్యాన్ని గుర్తించి ముద్రణకై పాక్షికంగా ద్రవ్య సహాయాన్ని అందించిన “ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి”కి,

శేషభారాన్ని భరించి గ్రంథాన్ని ప్రచురించిన “చైతన్య భారతి” కార్యవర్గానికి

గ్రంథానికి అక్షరాకృతిని కల్పించిన శ్రీ దీవి భావనాఋషి (శారదా ప్రెస్ - పొన్నూరు) గారికి కృతజ్ఞతలు...

గ్రంథ పరిష్కారాన్ని గూర్చి ఒక మాట. సరళాదేశాల వద్ద అర్ధానుస్వారాన్ని తప్పక స్వీకరించటం జరిగింది. మిగిలిన చోట్ల దాని

ఆవశ్యకాన్ని సంశయాత్మకంగా స్వీకరించటం వల్ల ఒక్కచో తదభావం కూడా కన్పిస్తుంది.

ఇక ఈ కావ్యానికి మార్గదర్శకులైన పాఠకులనుండి ఏ విధమైన అభిప్రాయాలైన, సలహాలైన పూర్ణహృదయంతో ఆహ్వానిస్తున్నాను. కృతజ్ఞతాపూర్వకంగా ద్వితీయ ముద్రణలో దిద్దుకొనగలను

నిర్మలత్వమెడఁద నిండువాఱెడు దాఁక
కలముఁబట్ట బలుపు గలుగు రాదు
పంకదిగ్ధమైనఁ బన్నీటనైనను
జలకమాడు జగము జడముగాదు

సౌమనస్యంతో

మీ

పొన్నూరు

డా॥ సూరం శ్రీనివాసులు

10-7-80

** తొలి ముద్రణకు కవి మున్నుడి*

భావనా శ్రీనివాసము *

కరుణశ్రీ

"సౌమనస్యము" చక్కని పేరు.

"సౌమనస్యం" అందుకోటానికి అర్థం చేసికోటానికి "సౌమనస్యం" కావాలి.

అసలు గుండెల అంచుల్లో ఏ కొంచెమైనా సౌమనస్యం అంటూ ఉంటేనే గాని సౌమనస్యం అనేది అనుభూతం కాదు.

సుమనశ్శబ్దానికి సుమము, దేవత, రసజ్ఞుడు అనే అర్థాలు ఉన్నవి. కనుక "సౌమనస్యం" అంటే సౌమ్య భావం, దేవత్వం, రసజ్ఞత అనే భావాలు స్ఫురిస్తాయి. ఈ కావ్యంలో రసికుడైన ఒక సుకుమారుడు పూలతోటలోకి వెళ్లి, ఒక సుందర సుమాన్ని త్రుంచబోతాడు. కాని అందాన్ని హత్యచేయలేక, ఆ సుమసుందరిని కోయటానికి చేయిరాక ఇంటికి తిరిగివస్తాడు. ఆరాత్రి సుమబాల సుకుమారుని స్వప్నంలో సాక్షాత్కరించి, కాముకుడైన వానికి ప్రేమ సందేశం అందిస్తుంది. స్వార్థంతో కూడిన కామానికి, స్వార్థరహితమైన ప్రేమకూ కల భేదం వివరిస్తుంది. మళ్లీ మనస్సు మార్చుకొని, మరునాడు పువ్వును కోయటానికి తోటలోకి వెళ్లుతాడు. అతడు వెళ్లి చూచేసరికి ఆ పూలబాల నేల రాలి, ప్రాణాలు గోలుపోయి ఉంటుంది. ఆ సుమసుందరి ఆత్మత్యాగం అతనిలోని మానవత్వాన్ని మేల్కొల్పుతుంది. ఆ మేల్కొల్పు అతనికి ఒక సవ్యమైన దివ్యమైన విశ్వప్రేమను, ఒక అమర సందేశాన్ని అందిస్తుంది. సంగ్రహంగా ఈచిన్న కావ్యంలోని కథ ఇది.

అందుకనే కవి తన కావ్యానికి "సౌమస్యము" అనే సార్థకనామం ఉంచాడు. కావ్యకుమారికి పేరు పెట్టుకోటంలో సైతం కవి ప్రతిభ తొంగిచూస్తుంది. ఈ సుమసుకుమార కావ్యాన్ని ఈ విధంగా సంతరించిన వారు శ్రీ సూరం శ్రీనివాసులుగారు. సాహిత్య శిరోమణులూ, భాషాప్రవీణులూ, అష్టావధాన ధురీణులూ, ఎం.ఏ. పట్టభద్రులూ అయిన వీరు పొన్నూరు శ్రీభావనారాయణ స్వామి సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా ఉన్నారు.

ఈ కావ్య స్వరూపం ఏమిటో, ఈ కావ్య పరమార్థం ఏమిటో, ఈ కావ్యాశయం ఎటువంటిదో రచయిత కావ్యావతారికలోని "నా నుడి" లో వక్కాణించారు.

"జీవిత" మంటే ఏమిటో రచయిత నాయకుని నోట ఇలా పలికించాడు-

"ప్రణయము రంగరించి మధుపాత్రను నింపి యొకొక్క బొట్టుగన్
జనతకుఁబంచి పెట్ట సుఖసాంద్ర మహేంద్ర ధనుఃప్రరోచులై
తన మమతల్ దిగంతముల దాకను సాగుచు విశ్వప్రేమ జీ
వన రమణీయ గీతములఁ బాడినచో నది జీవితం బగున్"

బ్రతుకు క్షణభంగురమని, అందువల్ల లోకానికి మంచిని పంచి పెట్టటంలో ఏమాత్రం ఆలస్యం తగదనీ, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం నిరుపయోగమనీ అంటాడు-

"తరువు బ్రతికియున్న తరుణానఁబాదులన్
జలముతోడ నింప ఫలము గలుగు
చావుగొన్న వెనుక సంభ్రముల్ దరలించి
నన్ ఫలంబు గల్గునా ధరిత్రి"

విశాల విశ్వం ఏవిధంగా అనంత ప్రేమ సందేశాన్ని అందిస్తున్నదో ఈ పద్యం హృద్యంగా చెబుతుంది.

"గుడి గోపురంబులు గుదురుగఁ గూర్చుండి
చిఱుగంట మ్రోతలఁ జెప్పునేమి?
నిలువెత్తు సెగలతో మలమల మాడుచు
వెలుగిచ్చు దివ్వెలు దెలుపునేమి?
తీవె పుట్టువు పూవు తావి నల్గడలకుఁ
బంచి పెట్టుటలోని భావమేమి?
విడివోని తలపుల ముడిపడి సుడియుచు
స్నేహ తంతువు దాను నేర్పునేమి?
తొలిని సార్థక్యమును బొందగలుగుటయును
బిదపఁ బదిమంది కొఱకుగ బ్రదుకుటయును
వేరు వేరు పదంబులఁ జేరియున్న
భావమున మాత్ర భేదమ్ము వలదనుటయు."

అనంత సృష్టిలోని అణువణువూ త్యాగమయంగానే గోచరిస్తుంది. పువ్వు పూస్తున్నది. వెన్నెల కాస్తున్నది. గాలి వీస్తున్నది. అగరువత్తి పరిమళిస్తున్నది. ఎందుకు? తన కోసం కాదు. లోకం కోసం. నదులు ప్రవహిస్తున్నాయి. తరువులు ఫలిస్తున్నాయి.

మేఘాలు వర్షిస్తున్నాయి. పొలాలు పండుతున్నాయి. ఎవరి కోసం? తమకోసం కాదు. పరుల కోసం. తానుగూడా ఈ విశాల ప్రకృతిలో లీనమై ఆకులో ఆకుగా, పూవులో పూవుగా, అణువులో అణువుగా కలిసిపోవాలని కరిగిపోవాలనీ తన జీవితం జగత్తుకు అంకితం కావాలనీ, ఉత్కటమైన ఉత్కంఠతో ఉవ్విళ్లూరుతాడు నాయకుడు-

"ఏ పూల తావులు నేపారు చిఱుతల
చిఱునవ్వు వెన్నెలల్ చిలుకుచుండు
నే ఝరీ నినదాలు నిహపరశాంతి సం
గీత మాధురు లల్లఁగేళి సలుపు
నే చిఱుగాలులు నేవేవొ గుసగుసల్
పలికి యాధ్యాత్మిక భావ మొసఁగు
నే కొండగుహలను నేక కంఠంబుగా
నోంకార ప్రతినాద మొరయుచుండు
నే నదంబుల త్యాగమే యేపుగాంచి
సకల కేదారములలోన శకలితమగు
నట్టి వానిలో నొకదాన నైన నాకు
నింత చోటున్న చాలదే యీ జగాన."

ఇదే విధంగా ఈ జగత్తులోని ప్రతి వస్తువూ కరుణార్ద్రంగానే దర్శనమిస్తుంది అతడి భావనకు. వ్యథావిధురమైన ఈ లోకాన్ని చూచి శోకిస్తున్నట్టే అనిపిస్తుంది. అటూ ఇటూ అంతటా విషాద నిషాదమే వినిపిస్తుంది.

"ఏ మేఘమాలిక యీ లోకమును గాంచి
నిత్యమ్ము వ్యథను కన్నీరు గార్చు
నే తటిద్వల్లిక యీ లోకమును గాంచి
ప్రాణమున్ రోయును భంగపడుచు
నే గిరిశిఖరాలు నీ లోకమును గాంచి
మధ్యగ విరుగు సమాధు లగుచు
నే నదీనదములు నీ లోకమును గాంచి
పలుమారు శుష్కించి వంతనొందు
ఏ సరస్వంతమును గూడ నిట వసించి
గుండె బ్రద్దలు గాగను ఘోషపెట్టు
నట్టివానిలో నొకదాననైన నాకు
నింత చోటున్న చాలదే యీ జగాన!"

తుట్టతుదకు జీవిత పరమార్థాన్ని ఇలా భావిస్తాడు.

"గుండె లోపల లోలోన గూడు కట్టి
నిలిచియున్నట్టి స్నేహమ్ము వెలికి తీసి
జీవితపుఁ బాత్రలోఁ బోసి చేదు విరిచి
యందఁజేసిన జనుఁడె ధన్యాత్ముఁడగును."

పూలబాల నేలరాలుటను జాలిగుండెలతో వర్ణించినాడు రచయిత.

"తెల్లవారినంత నెల్ల తోటయు మేలు
కొనెను -పూవు - తావి - కొమ్మ — రెమ్మ
నేల- నింగి - తీవె- గాలి- మరేవేవొ-
కాని యా సుమమ్ము కన్ను మూసె."

ఆ కరుణ దృశ్యాన్ని తిలకించి ప్రకృతి అంతా వెలవెలపోయింది. వలవల ఏడ్చింది.

"నవ వసంతుఁడు వచ్చి నవ్వింప నెంచిన
మల్లిక కన్నీరు మానదయ్యె
గంధర్వు లెందరో కలిసి ప్రార్థించిన
కోయిల గళమిచ్చి కూయదయ్యె
కొమ్మలు పూవులుఁ గోరి కాళులఁబడన్
బుడమి మౌనపదము విడువదయ్యె
కుసుమాసవము నింపి కొలువుండఁగుసుమముల్
గ్రోల మధుకరముల్ వ్రాలవయ్యె
ఆకు కదలదాయె- ఆమని యొక మూల
మూతి ముడిచి నిలిచె.."

సుకుమారుని స్వప్నంలో సాక్షాత్కరించిన సుమబాల కాముకుడైన అతడికి ప్రేమతత్వాన్ని ఇలా ప్రబోధిస్తుంది.

"మోహకాంక్షల విడనాడి ముసిరి వచ్చు
స్వార్థతత్వముఁ బెడఁబాసి సత్వదీప్తి
నొక్క యాకృతి హృదయాన నుంచి, గుండె
లోతులం జేరవలయు నే బ్రాఁతిలేక

ఒక తావున నిర్మలమై
వికసించిన పూల తావి విదిశల దిశలన్
సకలమ్మును వ్యాపించెడి
యకలుషగతి ప్రేమసూత్రమగు భావింపన్."

వెన్నెలతో ఆరంభమైన కావ్యం విశ్వ ప్రేమతో అంతం కావటంలో ఎంతో ఔచిత్యం ఉంది. విశ్వ ప్రేమ వెండి వెన్నెలలా, పండు వెన్నెలలా గుండెల నిండా నిండిపోవాలని రచయిత ఆశయం కావచ్చు.

కవి వెన్నెలను మనోహరంగా వర్ణించాడు.

హృదయేశ్వరునికోసం ఎదురు చూచే వాసక సజ్జిక విరిపొట్లం విప్పినట్లుగా ఉందిట వెన్నెల!

తీయతీయని కలలలో తేలిపోయే నిశాసుందరి కిలకిల నవ్వినట్లుగా ఉందిట వెన్నెల!

గుండెలలోని వలపుగనులను ఎవ్వరో త్రవ్వి కుప్పలు పోసినట్లుగా ఉందిట వెన్నెల!

ప్రతి యింటిలో పండుగనాడు పాలు పొంగించినట్లుగా కన్నుల విందు చేస్తున్నదట వెన్నెల!

ప్రప్రథమంగా కథానాయకుణ్ణి పరిచయం చేయటం చాలా చమత్కారంగా ఉన్నది.

గగనమార్గంలో కన్నూమిన్నూ గానకుండా విహరిస్తున్న పున్నమ చందమామ కాలుజారి నేల మీద పడినట్లుగా ఉన్నాడట ఆసుకుమార కుమారుడు. ఇలా అనటంలో వాని చక్కదనమూ, వాని ఎలజవ్వనమూ, చక్కని చుక్కలతో వాని రసికత్వమూ చెప్పక చెప్పినట్లయింది.

"పదములకుఁ బుట్టువుల నిచ్చు పెదవులైన
మధ్యగాఁ జీలి విడిపోయి మసలుచుండు."

చక్కని భావన!

"అది వర్ణశాలయె యయినను జడతాల్పు
లెవ్వరా తావున నెఱుకపడరు"

ఇత్యాది సీసపద్యంలోని వనవర్ణన శ్లేషసుందరమై విశేష సౌందర్యాన్ని సంపాదిస్తున్నది.

"తోటఁజుట్టి కాలి బాటలు వర్తిల్లుఁ
బాట దాటి తోట పరువులెత్తు." బాగుంది.

"చివురుటాకులు పూల చెండులు శయనింప
పాన్పు వేసిన రీతిఁ బరగుచుండు"

"పూలచెండులు తీవె బోఁణులు ధరియింప
మాలఁగూర్చిన రీతి మసలుచుండు"

సరసమైన స్వభావోక్తి సరసన ఉత్ప్రేక్ష.

"అనుచు మైలపడిన జనుఁడు మానవులకు
దూరమందు నిలుచు తీరు దోప"
రమ్యమైన ఔపమ్యము!

"కురిసిన రసహైన్యంబని
తరుణములో మొయిలు గములు దాగునె! మఱియున్
విరిసిన మధు హైన్యంబని
విరికన్నెలు రేకు విప్ప వెరచునె వనిలోన్!"

ఈ అందమైన కందంలో త్యాగమూర్తుల స్వభావస్వరూపాలను నిరూపించాడు రచయిత.

"వ్యర్థం బెయ్యది యుండదు
సార్థకమే సర్వసృష్టి"
ఇందు కవి చెప్పదలచిన కావ్యరహస్యం ఇమిడి ఉంది.

"చేత జిక్కినట్టి చిన్నారి చిగురాకు
పికము వెట్టు బాలపికము నోట"
ఈ గీతార్థంలో మాతృప్రేమ చిగురు తొడిగింది.

"అట్లు భావించి తన చేత నలరు నలరు."
సునాయాసమైన అనుప్రాసం.

"ఏదిగి పోవని యెదలోన నొదిగిపోయి"
ఎంత చక్కగా ఒదిగిపోయిందో!

"మించు త్రుటిమాత్ర మించుచు మెఱయుఁగాని
శాశ్వతములైన భావనల్ చాల కలుగు
మానవుని జీవితము క్షణంబైన నొక్క
యనుభవమ్మున్న నిల్చు కల్పాంతమునను."
భావుకుల భావాంబర వీధిలో మెరుపు మెరపించిన పద్యమిది.

ఈవిధంగా మానవ హృదయాలలోని వైమనస్యాన్ని దూరంచేసి, సౌమనస్యాన్ని సమకూర్చే సరసమైన సప్తదళముల "సౌమనస్య"మిది.

శుభమ్.

** తొలి ముద్రణకు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి ఆప్తవాక్యం*



తొలి ముద్రణ ముఖచిత్రం (కవి వేలి కొనలనుంచి)

అంకితం

...కన్నవారికి...

కైమోడ్పులతో



సూరం హనుమంతయ్య శేషమ్మ

వికృతి

వరునికై కడఁజూచు వాసక సజ్జిక
విరిపొట్లమును దీసి విప్పెనేమొ;
తీయని కలలోఁదేలెడి జవ్వని
నడి రేయి గలగల నవ్వెనేమొ;
అమలిన ప్రణయభావాలస యచ్ఛంపు
వలపుతో మృదుశయ్య పఱచెనేమొ;
సకలజనత, భావ సౌహార్ధమంతయు
విరియగ మడతలు విప్పెనేమొ;

గుండెలోపలి లోతులఁ గుములుచున్న
కూర్మిగను లెవ్వరైనను బేర్మిమీరఁ
ద్రవ్వి పైకిడిచుండిరో తలంపలేము
కాని, గగనాన వెన్నెలల్ గాసె నేచె

ప్రతియింటఁ బాలు పొంగిన
గతి గగనముదోచె వెల్గు కన్పడఁ గానీ
మితిలేనియడుగు మంటల
వెతుకగ నే కవికి భావవీథి నగపడున్

జనులకు దూరమై యెటనొ చాటుగనున్న యెడారులన్నిటిన్
జనతకు వాసభూములుగ సల్పగఁగోరి సుధాంకురంబులన్
దనియగఁజేయగా మృదులతాంచిత తత్ ప్రతిబింబజాల మే
చెనొ వినువీథి వెన్నెలలచేలమె మేల్ముసుగున్ ధరించుచున్

వెన్నెలలల కుప్పలాటలోఁ బిల్లవాండ్రు
నన్ని కుప్పలఁజెఱపిన యంత మింట
వెలుగు నల్దిక్కులన్ సాగి విరిసెనేమొ
కాని యచ్చోట నాయాట కలుగు టెట్లు?

కాలు జారిపడెనొ కావరమున శశి
యనెడి సందియమ్ము జననమంద
నడుచుచుండె నొక్క నవరాగ శీలుండు
రాగవతులకు నెలరాజతండు

అడుగునడుగున నిర్లక్ష్య మతనికగుట
పదముపదమునఁ దడబాటు పాయదయ్యె
నడత యెన్నెన్నో రాగాల నడచియుంట
నడకఁ దీవెలు చరణములల్ విడువవయ్యె

అన్ని వేళల సహచరి యగుచునున్న
నీడయును క్షణమాతని వీడదన్న
నౌర! యాతనిలోనున్న యంతులేని
స్నేహసందీప్తి వనితలఁ జేరునార్తి

అతఁడు గమ్యమ్ము సేరెడి యంతలోన
సుంత మాటాడవలెఁగాని యెంత పొగరు
పలుకడే! పోని నా నేర్చుకొలఁది కొంత
వాని గుణప్రాభవమ్ములఁ బలుకువాఁడ |

తన రాకకై దారిఁగను నింతియనురాగ
మును వృద్ధిపొందించు మునియతండు
దన చెట్ట మాయఁ జెంతను నిల్చు చెలినూర్పఁ
గల్లలాడని మహాకవి యతండు

సంకేతమున జారసాధ్విని నేకాగ్ర
తనుజూచు యోగసంధాత యతడు
దాఁజూడ వారకాంత మరొక్కరునిఁగూడ
వలదు తప్పను ధర్మపరుఁ డతండు

కట్టుకొన్నట్టి పెండ్లాముకన్న మిన్న
యన్యకై ప్రేమపంచెడి త్యాగి యతఁడు
తనదు దౌర్భాగ్యఫలమేమొ తనదె యనుచు
తండ్రితో నేమి యనని వేదాంతి యతండు

రూపాన సరిపోలు నా పుష్పబాణుండు
తూపుల తావునఁజూపులున్న
తేజాన సరిపోలుఁ దిగ్మరోచిష్కుండు
దోషమ్ము గని భీతిఁ దొలఁగకున్న
ననురక్తి సరిపోలు నమృతాంశుమౌళియు
నిద్దరాంధ్రను దృష్టి నెనయకున్న
వలపుల సరిపోలు జలజాతనయనుండు
పారిజాతము దెచ్చు పరువు విడిన

మగువల వలచుటం బోల్పఁ దగును శశియు
సరిసిజాతమ్ము విరియింపఁ జాలియున్న
నౌర! యెవ్వరు సరిపోల రా యువకుని
స్వస్వనియత ప్రవృత్తులన్ వదలకున్న

వెలయాలి పెదవి తేనెలఁ
గలకమ్మదనంపుఁ గళలఁగననేర్చిన యా
చెలుఁడు సతీ హృదయములో
గల యమృతఝురుల మునుంగఁగలఁ డే కలనన్

అరెరె! యాతఁడు నచ్చోట నాగెనింక
నేను మీతోడ మాటాడలేను - వెళ్లి
చూచుదునుగాక యటనేమి చోద్యమగునొ
కళ్లనన్నింటి నెడదకుఁ గాన్క చేసి

ఒక యింటి ప్రాంగణమ్మునఁ
జకచకమని నడచి ద్వారసన్నిధిఁ జేరెన్
డకటక తలుపులు మోదెను
బ్రకటించుచుఁ గామఝరులు పరుగిడు తెఱఁగున్

లోన నేవేవొ చప్పుడుల్ వాని వెనుక
తలుపు తీసిన సవ్వ డద్దాని వెనుక
తరుణి శ్రీముద్ర చెఱఁగిన ధాన్యరాశి
కరణి నొక్కతె కనులకుఁ గానుపించె

ఒక్కొకటిగ సోయగముల
దక్కించుకొనంగఁజాలుఁ దరుణీ యాయా
చక్కదనాలకు, బందువ
దక్కెడు నిపుడనుచుఁ జనెను తరుణుఁడు లోనన్

గుసగుసలో విసవిసలో
రుసరుసలో మౌనభావరోదసిలోనన్
బ్రసరములోఁ గనుసైగల
విసరములోఁ గొంతతడవు వినరా దెదియున్

ఆ నిశ్శబ్దతలో నిమేషము లధర్మైకాగ్రమౌ తన్మనో
ధ్యానంబున్ గ్రహియించె నేమొ సమయాధ్యానంబు పర్యాయతా
యానంబున్ విడి సాగె ముందుగనె కాలంభోధిలోనుండి బా
ధానవ్యాంబుధరంబు గ్రోలఁగ వివిక్తత్వంబు గల్పించుచున్

నీ సోయగములను నేఁజూడఁగోరుటన్
దారకానయనాలు తాము సాక్షి
నీ కనుపాపల నే నిల్వఁగోరుటన్
సోలుచుఁదిరుగు పాదాలు సాక్షి
నిన్న నిట్టులె పల్కి నిల్చె నింకొక కాంత
సన్నిధి నిది యేమి సాక్ష్య మకట
యౌర! యెందఱి చెంత నన్యాయ్యమౌ పదం
బుల నిట్లు త్రిప్పుచుఁ బలుకు నితఁడు

మొదటి రెండు నతని పెదవులా కాంతతోఁ
బలికె లోనఁ గినుక పారిపోవ
నతని యంతరాత్మ యా శేషవాక్యముల్
నాకుఁ జెప్పెఁ గినుక నన్నుఁ జేర

పదములకుఁ బుట్టువుల నిచ్చు పెదవులైన
మధ్యగాఁజీలి విడిపోయి మసలుచుండు
నా పదంబులె యాశ్రయం బైన భావ
మాల విడి విడి పువ్వులై మసలకున్నె!

ఆ కోపం బతివేల మౌట నభ మందా రిక్క మొత్తంబులన్
సాకల్యంబుగ లెక్కిడం దలఁచి యంతర్లీనమై యుండగన్
సాకూతంబుగఁ గోడి కూయ మతియున్ నన్జేర నేఁ జూచితిన్
రాకాచంద్రుడు నాకుమారుడుఁ బరివ్రాజంబు గావించుటన్

అతని వెంట నడచి యాతరఁడాగిన చోట
నిలువఁగనులముందు నిలిచే నొక్క
తోట- యతడు లోన దూఱెనా యందాల
తీరు లరయఁ బూలదారు లరయ

ప్రకృతి

అది పర్ణశాలయె యయినను జడతాల్పు
లెవ్వ రా తావున నెఱుక పడరు
అది పానశాలయె యయినను మధువుల
చషకంబు లచట నెసంగఁబోవు
అది కళాశాలయె యయినఁ బరస్పర
స్పర్ధలా తోటలో ప్రబలఁబోవు
అది నాట్యశాలయె యయినను డమరుమృ
దంగాదు లందున నలరవెపుడు

నది మనోహర శిల్పమే యతివ గాదు
అది మహాసత్వమూర్తియే ముదిమిఁ గాదు
అది జగన్మోహనాత్మయే యబల గాదు
అది విధాతృని సృష్టియా? యవునా!కాదొ!

సకలోర్వీతలవల్లికావితతినిస్స్వానమ్ము లావణ్యసూ
నకళాలీలల పుట్టినిల్లు పరమానందానుభూత్యుత్క శా
రిక లాశించెడి మెట్టినిల్లు జనతాశృంగారలీలావిలా
సకథావీచిక పొంగిపొర్లెడు సరస్వస్తమ్ము నాద్యంతమున్

అది యొక రాగప్రవాహిని
యది యొక రమణీయమూర్తి యది మోహినియౌ
నది యొక లీలోన్మాదిని
యది యొక స్పృహణీయదీప్తి యది భావనయౌ

ప్రేమమయ సృష్టి భావగంభీరమైన
రాగమయసృష్టి ధ్యానసంరక్తమైన
మోక్షమయసృష్టి జీవసన్మూర్తియైన
శిల్పమయసృష్టి యూహింపఁ జేవకొలఁది

మానవజీవితమ్మున సమస్థితి దుఃఖసుఖమ్ములట్లు నా
సూనవనాంతరాళమున శోభిలు నీలవినీలపుష్పసం
తానము పుణ్యజీవితవితానము తానము రమ్య రాగసం
ధానవిధానమందు బహుధాపరిణద్ధలతావితానమున్

ఎన్ని జన్మల పుణ్యమో! యెన్ని పుణ్య
కర్మల ఫలితమో యింత కలుగకున్నఁ
బుష్పికాజన్మ మేరీతిఁ బొందఁ గలరు?
ఎట్టి మహనీయు లా తోటఁ బుట్టినారో!

నీరసశిథిలిత పత్ర
ప్రేరితభావనలు హృదయవీణాతన్త్రీ
సారవిదూరములై సా
వేరీరాగమునె యందు వినిపించుఁ గటా!

మంచు ముసిరెడు నజ్ఞానమార్గ మొకఁడు
జ్ఞానమార్గమ్ము గప్పెడి కరణి విరుల
కాని భానుఁడు తుహినమ్ముఁ గరగఁ జేయు
జ్ఞానతేజ మజ్ఞానమ్ముఁ గాల్చు రీతి

భావుకా! యా కవితావరూధిని మెచ్చి
నీపయిం బడు నట నిముసమున్న
లేఖకా! రమ్యప్రకృతిసతి హొయలతో
నీయెడందఁ దొలుచు నిలువ నచట

గాయకా! మధుకలగాంధర్వరాగమ్ము
                నీగళమ్మునుఁ జీఱు నేగ నటకు
నర్తకా! దేవతానారీమణుల్ నీదు
                పదముల నటియింత్రు కదలనందు

కమల మూయకు ప్రవరుని కథను బోలె
నెదను మూయకుఁ జిత్రసంపదనుబోలె
గళము నాపకు పుట్టుమూగలను బోలె
పదము లాపకు స్థాణుతత్త్వమ్మువోలె

తొలిసంజ వెలుగులోఁ దెలి మంచు తుంపర
                ల కళల సొగసు మేలమ్ములాడు
భానుప్రతాపప్రభావాతిశయమున
                మోమున దిగులు దోబూచులాడు
మునిమాపు వేళలోఁ గని విని యెఱుఁగని
                యందాలు కొమ్మల నాటలాడు
వెన్నెల రేల సంపన్నములైన భా
                వాలఁ బ్రశాంతత జోలఁబాడు

నిముసనిముసమ్ము ప్రకృతిలో నిరుపమాన
కాంతి కణకణంబున నిండి కదలియాడు
ననెడి భావన లా లతావని యెదందఁ
గలుగఁ జేయఁగఁ జాలు సాకల్యగీతి

తోటఁ బుట్టి కాలిబాటలు వర్తిల్లుఁ
బాట దాటి తోట పరువులెత్తుఁ
గాలిబాటలయ్యు కమనీయహాటక
భావజననశక్తిఁ బరిఢవిల్లు

ఎందఱో పూర్వజన్మంబులందు భావ
కవులయి మనోజ్ఞ కవితావికాససృష్టి
మొగ్గలై పూవులై నేడు పూచి నార
లా వనీతలపర్యంత ప్రాంతమందు.

ఆ తోట నో మూల నతులితకల్పనో
పేతమై విలసిల్లు పెంకుటిల్లు
నా పెంకుటింటిలో నాలుబిడ్డలఁ గూడి
తుష్టిమై జీవించు తోటమాలి
యా తోట మాలిలో నఖిలపుష్పావళిఁ
బెంచగ నెంచెడి ప్రేమసుధలు
నా ప్రేమ సుధలలో నలరారి వంపు సొం
పులతోడఁ బెరిగిన పూలచెట్లు

అట్టి పూల చెట్టు లా పెంకుటింటిని
చుట్టి చుట్టుముట్టి చూడ్కులందు
రాగసుధల జార్చి లాహిరిలో దానిఁ
దేలియాడఁ జేయఁ జాలి యమరు

చివురుటాకులు పూలచెందులు శయనింపం
బాన్పు వేసిన రీతిఁ బఱఁగుచుండుఁ
బూలచెందులు తీవెబోణులు ధరియింప
మాలఁ గూర్చిన రీతి మసలుంచుండుఁ
దీవెబోణులు తరుల్ తెలివిఁ గౌగిలినింప
భంగిమల్ చూపిన పగిది నుండుఁ
దరులు కౌగిలిలోనఁ దన్మయత్వముఁ జూప
నిచ్చలు సిద్ధమై నెగడి యుండుఁ

జివురుఁ గైదువుజోదు నా వగలఁ జూచి
మరల వలపులు రగిలింప మనసు పడును
బ్రత్యణువు నటఁ ద్యాగ భావాయతాత్మ
మన్నఁ జెప్పఁగ నేల? యన్నన్న దాని

సంఘర్షణ

ఆతఁడు తద్విలాసముల యంచుల సంచరదాత్మభావనా
తీతపదక్రమంబుల నదేమి విచిత్రమొ లోని కేగె వ
ల్లీతరుసంగమం బతనులీలలఁ దేలుచు నుండియున్ లతాం
తాతత ముక్తి జీవితపుఁ దత్త్వముఁ దెల్పు మనోజ్ఞ మా వనిన్

తత్కరంబుల శక్తి తరులతో లతలకు
మోక్షంబు గల్పించి మురియుచుండఁ
దత్పదంబుల సక్తి తరుముక్తలతలను
బుడిమితో నైక్యంబుఁబొందఁ జేయఁ
దన్నఖంబులరక్తి క్రొన్ననలం గల
యపరిపాకత నంత మందఁజేయఁ
దద్విలోచన భక్తి తప్తపత్రమ్ముల
వైరాగ్యభావమ్ముఁ బరిహసింపఁ

బూలు చల్లి యున్న పుణ్యస్థలంబున
మదవు టేన్గు తిరుగు మాడ్కి యతఁడు
వనిని దిరుగ సాగెఁ బదములు పట్టఁగ
సాహసమ్ముఁ జేయఁ జాలు నెవరు

ఒక్క లతాంతమె యెంతే
నక్కజమగు సొంపుతోడ నాతని చిత్తం
బక్కునఁ జేర్పఁగ వేఱొక
దిక్కునఁ జనలేక వేగతీవ్రత నణచెన్

కన్నులు చూపులున్ రసన కాళులు వ్రేళులు జానువుల్ భుజా
భ్యున్నతి గుండె విస్తృతియు నూపిరి కర్ణము లుత్తమాంగమున్
మున్ను యథేష్టమార్గములఁబోవుచు నుండిన వన్ని యప్పు డే
తెన్నునొ యేక మార్గవిస్మృతింగొనెఁ దత్సుషమావిభావనన్

పాలు వహ్ని పెరుగు కాలమ్ము కలియఁగ
యోగశక్తి వెన్న యుద్భవించు
నట్టు లొకటి కాగ నఖిలేంద్రియంబులు
జ్ఞానదీప్తి పుట్టె వానియందు

ఎఱుఁగఁగలమె యెప్పు డే శక్తి యెవ్వాని
నే విధానమందు నేగఁజేయుఁ
దెలియఁగలమె యెట్టి తీరు లెవ్వారిని
నెట్టి దారి నుండి యివల లాగు

ఆపై నాతని లౌకిక
తాపంబుల నేమి మిగిలి తగులుట ఫలమో
యా పరమానందము విడ
నీ పగిదన్ హృదయవీథి నేచెం దలఁపుల్

ముద్దుల యందముల్ పసిడిమూసలఁ బోసినరీతి వెన్నెలం
బద్దులు రేకవోవకయె వ్రాసినరీతి మరెన్నొ ముచ్చటల్
కద్దని కంటిపాప పడిగాపులఁజూచుచు నున్నరీతి సం
పద్దళశోభమానసుమభామిని కానఁబడెన్ వనిన్ వడిన్

ప్రకృతికాంత యొక్క పరమార్థముం దెల్పఁ
దనదు భావవల్లి దినదినమ్ముఁ
గంటినీటఁ బెంచ మింటికెక్కిన తీవె
కన్న కాన్పు ముందు నున్న పూవు

ఆతఁడు సూచినంత జవరాలి మెఱుంగు నెఱుంగు కొప్పు నెం
తో తమకంబుఁ గూర్పగ మధు స్రవదద్భుత సూనశక్తిఁ ద
న్నీతరుణత్వ మంతయును వే వెలఁగట్టగ నిశ్చయించి డా
చేతినిఁ జాచి గిల్లుటకు సిద్ధపడెన్ విరిబోణి వృంతమున్

ఎదియో తడబాటతనికిఁ
బదముల నెదలోనఁ దలఁపుఁబందిరిలోనం
గుదురగు చూపులలోనను
ముదిరిన పలు వలపుభావముల నీ రీతిన్

ఇంతటి వంపు సొంపులను నిల్లరికమ్ముగఁ దెచ్చుకొన్న పు
వ్వెంతటి పుణ్యమూర్తి యిట నిట్టుల నిల్చుచుఁజూచుచున్న నే
నెంతటి ధన్యమూర్తిని యిదే సుమమూర్తి నలంకరింపగా
వంతులు వేయు మానినుల భాగ్యవిశేషము నేమి చెప్పెదన్

గాలికి రెప రెపలాడుచు
సోలుచుఁ గన్పింపసాగెఁ జూపుల యలరుల్
జాలిగ నెదలోఁ గరుణను
దేలగఁజేసెడు నొకింత తెలియఁగ వలయున్

చేతి వ్రేళుల కొన చిఱుగాలి సోకిన
సుమ మెంత నలుగునో చూడవలయు
గిల్లిన వెన్వెంటఁ దల్లడిల్లుచు బాష్ప
ముల నెంత కార్చునో తెలియవలయుఁ
దనివి తీరఁగ వాననుఁ జూడఁ బీల్చిన
విరి యెంత కమలునో యరయవలయు
జవరాలి వేనలి సవరించి నంతనే
యేరీతిఁగందునో యెఱుగవలయుఁ

జెలియమోముఁజూడ బులుపెంతయును లేక
కురులలోన నలరు నెఱినిఁజూడఁ
గినుక బూనఁ గాంత వెనుక దాగిన విరి
యెటుల నవ్వగలదొ? యేమొ? నాడు

అందము నా సొమ్మనియెడి
పందెము నాతోన సకలపరమార్థంబుల్
విందుగ నందిన వాఁడను
కందగఁజేసెదను పువ్వుకన్నియ పొగరున్

ఎన్నాళ్ళకు నా కన్నులు
నన్నే నమ్మింపఁగలిగె నవరసధారల్
పున్నెపుఁబ్రోవులు నలరుం
గన్నియలకుఁ గల వటంచుఁ గలవరపఱపన్

ఏ కన్ను పడియెనో యీ కన్నె వలపుల
దృష్టి దోషమ్ముచే రేకు తెగెను
ఈ సోయగంబుల నెవరు సహింపరో
కంటకమ్ములు గ్రుచ్చి గాయపఱప
నెవని ద్వేషాగ్నికి నీ గుండె బలియాయెఁ
గన్నులు తేనెరక్తమ్ము గార్చు
నే మంచి గుండియ యే బోధఁ జేసెనో
యాతిథేయతఁ జూచు నళివితతిని

ఐన నింకెంత సేపులే యంతలోన
నాదు నఖరాగ్రములు సోక నవ్యనవ్య
రాగరంజితమై తీగె సాగ సాగఁ
గౌగిలించెదఁ గోరికల్ గమిలిపోవ

స్పర్శలో నున్న సారంపుఁబస యెఱింగి
యెపుడుఁ బ్రాకుచుఁబ్రాకుచు నెదుట నెదుట
నున్న తరువుల కౌగిలి నుండఁగోరు
తీగెపుట్టువే యొడిలోనఁ దేలకున్నె

అని భావించుచు ముందునున్న కుసుమాంగ్యాంతర్యమున్ ప్రేమభా
వనలం బొంగఁగఁ జేయుచున్ మృదులతాభాసత్కరాగ్రంబు పా
వనవల్లీజము దాకఁ జాపిన నదే పాపంబొ శాపంబొ చే
తన దేహంబున నక్రమైకగతిగా ధావించె నాద్యంతమున్

చేయి వణఁకె నేల చేఁజారి పోయిన
వెనుక నేమి గలదు వెధవ బ్రతుకు
కాలు కదల దేల కడదాక సాగఁగ
శిలనొ కాక శాపఫల మదేమొ!

అనుచు మైలపడిన జనుఁడు మానవులకు
దూరమందు నిలుచుఁదీరు దోప
నతడు ముందు కేగ నది యేమి దోషమో
వల్ల కాదు తలఁపు వల్లకాడు

ఐనఁబంతము పట్టుచు నా యువకుఁడు
ముందుకున్ దూకి సుమబాల నందఁగోరె
నే వికారము స్పృశియించు నేమొ కాని
యే వివేకము జనియించు నేమొ కాని

మదిలో నిన్నటి దాకనుఁ
గదలాడిన జడత పుష్పకన్యక ముట్టం
గదలఁగ నదియే చిత్రమొ
వదలక నిలిచెను గరములఁ బదములలోనన్

ఏదో రాగము మోయసాగె నెదలో నేదో పురాజన్మస
ద్గాథల్ చూడఁగ వెంట వెంటనె తరంగాకార చైతన్యమున్
మీదన్ మీద చరించె నెక్కడిది సుమ్మీ భావబంధంబు సం
మోదప్రాభవసత్ఫలమ్ము హృదయాంభోధిం బ్రపం జేసెడిన్

ఒక రమణీయదృశ్యమును నూహలు నేసినఁ గంటఁ జూచినన్
వికలితమై యెడంద పరివేదన లోతులఁ బెళ్లగించు దా
నికిఁ గత మెద్ది జీవనమె నిల్పెడి స్వార్థకళంకభావమా?
యకలుష ప్రేమపూర్ణ జననాంతర సౌహృదసంవిధానమా?

ఆ రీతి సౌహృదం బొక
డా రోహింపంగ భావనాంబర సీమన్
సారోదారమనీషా
భారంబున నిట్టు లతఁడు భావించె మదిన్

కోసిన నందచందమల కూటమి యోటమి నందు నేమొ యా
వాసన వాసిఁ బాసి వసివాడునొ యేమొ కవీంద్రకోటితోఁ
జేసిన బాస లన్ని చెద సేరిన మూసగ మారు నేమొ యా
హా! సుమ రాగజీవనము నా ప్రళయాంతము నిల్పఁగా వలెన్

ఐనను వనిలో మమతా
ధ్యానముతో మౌనముద్ర నలరెడు దానిన్
దేనికిఁ గోయంగా వలె
నే నైనను నెవ్వరైన నేనాఁడయినన్

ఎన్నో జన్మల పుణ్యము
పన్నీటను గడిగి చెలిమి పలుకులతోడన్
వన్నెలు దిద్ది సుమంబుగఁ
బన్నెను పరమేష్ఠి నిల్పవలయుం గడకున్

ఆశగఁ జూచుచున్న దది యందవ యేమిటి యందగాఁడ నా
యాశలఁ గూల్చి వేసెదవ యంచు వచించుచు నున్న దేమొ నై
జేశత గీతికావితతి యేనని నేనని ముందు నిల్చినం
బ్రాశనఁజేయు గాయకుడు రాగసమంచిత మొక్కఁడే గదా

కొన్నింటిని బ్రతినిత్యముఁ
గొన్నింటిని నప్పు డపుడు గొన్నిటినన్న
న్నెన్నడు వాడక పేటిక
నున్నది యని తృప్తి పడుట యున్నది జగతిన్

అదియె పతాక యందముల కన్నిటి కయ్యదియే నశింప నే
యెద దయ నాశ్రయం బొసఁగు నీ పలువన్నెలఁబ్రోవుఁ గావ నె
య్యెదియును కాదు కాదనిన నెక్కడి కేగు ననాథ యంచు జం
కెద నిపు డీ సుమమ్ము హృదయేప్సిత మైనను గోట గిల్లఁగన్

ఒక్క మాట దీని నొక్కమాటుగఁ ద్రుంచి
యనుభవించినంత నాశ దీరు
బ్రతుకు తీరుదాక భావించుచుండిన
మారుజన్మ కైన మారు బ్రతుకు

ఈ లతతో సుమ మిట్టులఁ
గాలాంతమువరకు నున్నఁ గళ్యాణంబుల్
వేలకు వేలుగఁ గలుఁగవె
చాలిక చేకొనెడి యాశ సాగెద నింకన్

అని మెలమెల్లగఁ జనుచును
గనఁ జేసెను బెనుతుపాను కలిగెడి కాలం
బున మును నిల్చు ప్రశాంతత
తన మనమునఁ దోచుచుండఁ దత్పరమతియున్

కని యతని వర్తనమ్మును
మనసు కలుక్కు మనఁగ సుమమానిని యెంతో
వనట సహించుచుఁ జింతిం
చెను మెల్లగ నిట్లు మధుర జీవనపదమున్

స్పందన

ఎంతటి యందగాఁడొ హసియించిన వెన్నెలవాన వెల్లువల్
వంతలు పాడఁగా హృదయవారిధి పొంగుచు నింగి నంటదే!
సుంత కనుంగవన్ విరిసి చూచినఁ బున్నమనాటి చందురున్
జెంతకుఁ జేర్పదే! మసృణజీవకళన్ దనియింపఁ జేయదే!

తెలి వెన్నెల ఝురు లెన్నియు
గలసిన వీ దృగ్వితాలకారుణ్యమునన్
గలయం బ్రాకుచు నాపై
నిలిచినచో నప్డు బ్రతుకు నిక్కము బ్రతుకౌ

బంగారు కలలను బండించి పైరుల
　　　　కదలికల్ పేర్చెనో కన్నులందుఁ
గుసుమాల కుప్పలం బసరును దీసి మై
　　　　సొగసుల నిర్మించి చూచె నేమొ
వెన్నెలల్ కాచి యావిరి చేసి దాన ని
　　　　శ్వాసజాలముఁ జేయఁజాలె నేమొ
విరుల నైనను లాగు వింత యయస్కాంత
　　　　శక్తి నీ తనువు సంసిక్త మేమొ
జలజభవుఁ డెట్లు చేసె నీ కలువఠేనిఁ
గాక లీయమా? కాక రేకవోని
ప్రాణినిర్మాణ చాతురీ ప్రాభవమ్మ
శిల్పసంపద లెన్నొ తీర్చిన ఫలమ్మ?

ఒక రమణీయకావ్యకళయో, యొక సుందర శిల్పదీప్తియో
యొక స్పృహణీయభావలతయో, యొక రాగనిధానభూమియో
యొక యకలంకహాసవిధియో, యొక వెన్నెల పారిజాతమో
వికచనవప్రసూనపదవీపద మందుఁ బరాగరేణువో!

ఆ సుకుమారుఁడు చేయిడి
యీ సుమతను ధన్యఁజేయ నెంచునొ లేదో
యే సరణి నైన జీవన
కాసారమునందు విరులు కలుగునొ లేదో

రేకు రేకును విరఁబూచి రేయిపగలు
వేచియుండుట సఫలతాభీష్టఫలమె
యనుభవమ్ముల నందమి నధిగమించు
మధురమకరందధారల మనుగడేల?

జీవిత మన్నచో నెడఁదఁ జీల్చు మమత్వసుమానుబంధమే
భావన మన్నచో ననుభవమ్ములఁ జిమ్మెడి పారిజాత మా
భావన జీవనమ్ములను బందిరులల్లుచు దాని నీడలో
దావినిఁ బొందుచున్ బ్రతుకు దాల్చి చరించి తరింపలేనొకో

ఆతని చూపులో మనసు కందగరాని కవోష్ణభావనా
వ్రాతము లాత్మనంటెడు నవారితవార్ధితరంగవిభ్రమో
ద్ఘాతములై కలంచెడు నతంద్రపిపాసయు రెక్క విచ్చుఁ గా
నీ తనియింప డేమి రమణీసుమశిల్పహృదంతరాళమున్

చనినఁ దన దారిఁ దానింత వనట లేదు
కాని చేఁజాపి యా పైనఁ గానిపనినిఁ
బోలె నిలిచిన హృదయమ్ము తాళఁగలదె
రగులు వలపునిప్పుల నార్పి మిగులఁగలదె

నేడో రేపో నశించు జీవితము కానీ దాని నైశ్చల్యపుం
జాడల్ సూచుచు వానిపై నడచుచున్ సాగించు నీ నాటకం
బాడన్ లేక ముగింపుఁ జేయుదురటే యర్థాంతరఖ్యాతి వే
యాడన్ దండుగ దీప మన్నయపుడే నౌ నిల్లు దీర్పించుటల్

శ్రీరామ చంద్రుని చిన్ని తమ్ముడ కాక
మఱి యేల నీ రీతి మౌన మేల?
ప్రవరద్విజ శ్రేష్ఠ వంశసంజాతుఁడా
కాక యీ రీతిగఁ గలత లేల?
రసమయజీవన ప్రసరముల్ దెలియఁడా
కాక యీ రీతిగఁ గాంచు టేల?
మోహించుసతిఁ జేరి మోవి ముద్దిడ నేర్వ
డా? కాక యీ రీతి డాయ నేల?
బ్రతుకు పండునంచు భావించు చుండఁగ
తలఁపు వేరు నఱకఁ దలఁపఁ దగునె
ఫలము నీయలేక కలకాల ముండినం
దరులు నేలచేటె తత్ఫలమ్ము

బ్రతుకఁ జాలిన నాల్నాళ్లు బండవాటి
శిథిలశిల్పమ్ము వోలెను కదలకుండి
యేమి సాధింపఁజాలెడు నెవ్వఁడైన
బ్రతుకు కర్థమ్ము మౌనమా? భావనమ్మ?

వెన్నెల లెఱుంగు నానాడు విరిసి విరిసి
రేపకడఁ జచ్చి పోవుట పాప మయిన
మరల మరు రేయి విరియుట మానుకొనునె
మానినన్ భువి చీకటుల్ మసలకున్నె

అనుభవమ్ముల కందిన నంద కున్న
నిత్య మేదియు లేదు కానీ విచిత్ర
మర్భకుని వోలె విడిచెనే యనుభవాల
దాన నా జన్మ నిత్యమౌ దారి కలదె?

ఆద్యంతంబుల హృద్యమౌ బ్రతుకు నందాద్యంబు భోగ్యంబు సం
వేద్యాంతః పరిణామ మంతము మదిం బెట్రేగు కోర్కుల్ సదా
యాద్య ప్రాంగణరంగవల్లికలు నందానందమౌ రత్నముల్
తద్యోగంబును సౌఖ్యదాయి యితఁడేలా? దాని భావింపడే

అవునుపో చిన్న వాఁడని యంద మన్నఁ
జిన్న వాఁడె మరియు నందమున్న వాఁడె
కాని భావనాలోకానఁ గాలు గాలు
పిల్లి వలెఁ దిర్గుచున్నాడె తల్లడిల్లి

నలువ యనంతకాంతుల ననారతమున్ రమణీయ శిల్పసం
కలనమునందు నేర్పుఁగొని కాని రచింపడె యిట్టి సొంపు పెం
పలరెడువాని కాని యది యంతయు వ్యర్థము కాగ గుండెలో
నిలువుట మానెనా? మధురనిర్మలరాగరసైక జీవముల్

శిలలునైన రాగకలితము లైనంతఁ
గరఁగి యొఱగి పోవుఁ గనులముందె
శిల్ప మితఁడు రాగసిద్ధినిఁ బొందియుఁ
గరఁగ డౌర! కలల విరియ డౌర!

పున్నమి నాటి వెన్నెలలఁ బ్రోగయి పొంగెడి వార్ధిజీవముల్
మిన్నున కంటగాఁ దగిన మేల్తరముల్ జతనాలు సల్పవే
మన్నున నున్న యిర్వురకు మాకిటఁ బొందిక చిక్కుకున్న నే
తెన్ను లభించు జీవితపుఁ దీరు శుభాస్పదమై రహింపగన్

కేల్సాచినప్పుడే కెరటమై తమి రేగెఁ
బాణిగ్రహణ మను పరవశాన
నడుగిడి నప్పుడే యదరి గుండియలోన
సప్తపదగమనసంభ్రమాన
కనువిచ్చి నప్పుడే కలలసందడి లోనఁ
గళ్యాణమాల యన్ గామితాన
నెఱి నవ్వినప్పుడే కురిసె వెన్నెల వాన
తలఁబ్రాలు వోసెడి తలఁపులోన

ఔర! కళ్యాణ మింతలో నంతరించెఁ
బుట్టినప్పుడే బ్రతుకంత పూర్ణమయ్యెఁ
గాంక్షలన్నియుఁ బడమటిగాలి రాలు
మావికసుగాయలై పోయె మంట రేగ

మించుఁ త్రుటిమాత్ర మించుచు మెఱయుఁగాని
శాశ్వతము లైన భావనల్ చాల కలుగు
మానవుని జీవితము క్షణంబైన నొక్క
యనుభవమ్మున్న నిల్చు కల్పాంతముననను

కురిసిన రసహైన్యం బని
తరుణములో మొయిలుగములు దాగునె మఱియున్
విరిసిన మధు హైన్యంబని
విరికన్నెలు రేకు విప్ప వెఱచునె వనిలోన్

వ్యర్థం బెయ్యది యుందదు
సార్థకమే సర్వసృష్టి సన్మార్గములో
నర్థంవు విలువ లెఱుగమి
స్వార్థము నిలువెల్ల నిలిచి సాధించు జనున్

కురిసె నెడారులఁ గొండంత వర్షమ్ము
నేటికిఁ జుక్కైన నీరు గలదె
కలసెను కడలిలోఁ గల్లోలినులు పెక్కు
తీయఁదనము నేఁడు తెలియఁగలదె
కరఁగెను వెన్నెల కలువ రేకుల లోన
మరునాటి కింతైన మరక గలదె
మెఱపు కనుల కెట్లు మిరుమిట్లు గొలుపును
మరునిముసమ్మున మసలఁగలదె

ఇంతగా నేల చిననాటి కెదగ లేని
తలఁపు లెన్నియొ గుండెలోతులను దాగు
మృత్యుదేవతాచరణ సమీపమునకు
నడచుచుండఁగ మది నెన్ని విడుచు గతము

జీవనదిలోనఁ బడుచున్న జీవితాశ
యాల నీడలు నలల సయ్యాటములకె
యౌర! బలియైన జీవిత మగును కాదె
నీడ లేనట్టి దా పాటి నీతి వినడె

పోనీలే యనుకొంద మేని హృదయంబున్ పొంగు కల్గించి యే
దో నవ్యామృతధారయైన కనులన్ దోడ్తో విలోకించి యం
తా నాదే యనిపించి దూరము సనెన్ దద్దర్శనైకార్తదృ
క్కోణంబుల్ పలువన్నెలం గొనె లతాంకూరంపు సారంబులన్

వెలుఁగుంజీకటి మధ్య దీప్తి భువికిన్ విస్వీథికిన్ మధ్యలో నిలువం
జాలిన యార్తి యే ముడులకో నిస్సార్థన మాశానిరా
శల యద్వైతపు మూర్తి బంగరురుచుల్ సస్యమ్ము పండించి యే
కలలోఁ దథ్యముఁ జేయు సంగతి యనంగా భిన్న జీవాలకున్

ఆవర్తంబులె యాక్రమించె వడిగా నా చూపులం బుద్బుద
ప్రావీణ్యంబు వసించె హాసములలో రాకేందుబింబంబు స
ద్భావంబందె నదేమి దేహమ సుధాధామంబు సంద్రం బసృ
గ్భావంబున్ గొనెనా మనంబు వడదో కామార్తి నద్దానిలో

ఇటు భావింపఁగ సుమమా
పటుశోభల నలరునలరు పదపదమందున్
జటులతరవర్తనమ్ములు
నటియింపఁగ వన్నె కాఁడు నవశక్తియుతిన్

మరలం బూవు గ్రహించుఁ గోరికలతో మాద్యద్విలోకమ్ముతోఁ
ద్వరగా మో మిటు సుంత త్రిప్పి కనఁగన్ దత్పూన యోషామణిన్
జెరలో నాకలిగొన్న బెబ్బులి యనం జీరాడు రాగంబుతో
విరి చూపట్టెను పట్టు లోచనములన్ విస్పష్టమై యుండగన్

ఆ చూపున్ భరియింపలేక లలితోద్యానమ్ము నాసాంతమున్
జూచెన్ భీకరమృత్యుమందిరగతిన్ సూనావళిం గోరలన్
జూచెన్ బుష్పమరందధారల నసృఙ్ఞ్యానత్వముం భావనా
వీచిన్ హాలహలమ్ము వెంటనె సనెన్ వేవేగ నా యింటికిన్

సంవాదము

మలయమారుత చలల్లలితవల్లీ లస
　　　　త్సానంద నాట్య సంస్తంభకములు
దరదరద్దళ మంజు తత్సుమ సౌందర్య
　　　　భావనానంద సంభ్రమకరములు
మధుపానమత్త షట్పద పద విన్యాస
　　　　జన్య సౌజన్య సంచాయకములు
తద్గరీయః కాంతి తాదాత్మ్యసంధ్యాన
　　　　సంజాత మృదులతా శంసకములు

పక్ష్మలమ్ములు సరయసంవ్రాజకములు
తన్మనోగత భావనాతంద్రగతుల
కాత్మతత్త్వైకదర్శనాభ్యాసదీక్ష
నిడినగతి పక్ష్మముల్ మూయఁబడియె నంత

బాహ్య చైతన్య మంతయు బండవాఱె
నసువులం బాసి నిలిచినయట్లు మరల
నూత్న చైతన్య మందెడి యత్నమేదొ
యాంతరములోన జరగదె? యది కలుగదె?

కలలఁ బోలెను క్రొంగొత్త యలలఁబోలె
జీవితముఁ జూచు నాతని జీవు దపుడు
కలల సరిక్రొత్త జీవనములనుఁ జూడ
నాటి కథ నెంచె మదిలోన నాటి యుంట

ఏటికిఁ దాక నైతిని యహీనరసోచితసౌకుమార్యముం
జూటుచుఁ బూవువింటిదొర చాపము నెక్కడి యా సుమమ్ము నా
నాటికి యౌవనంబు విడనాడి యసహ్యతఁ గూర్చు నట్టి యా
బోటులఁ గ్రిందుఁ జేయఁగల పోడిమి లేదె భ్రమల్ జనించెనే

కనలేక పోతినే కాంతారసుమలక్ష్మి
                లావణ్యధీగణ్య రమ్య రేఖఁ
గనలేక పోతినే కళ్యాణదళ రాజిఁ
                గాంతాంగసంగత కమ్రరేఖఁ
గనలేకపోతినే తనియ మరందాల
                నధరబింబములోని యమృత రేఖఁ
గనలేకపోతినే కనలని సుమధూళిఁ
                బడఁతి చెక్కిళ్లపైఁ బాండు రేఖఁ
గాక కనలేక పోతినే కరుణ లేని
నలువ నన్గాంచుఁ గ్రొత్తతీఋల విలువను
అవుర యాకాంతఁ దాకఁగ నైతి నేల?
అనుభవా లేల? వలపుల ననలు నేల?

తినుబండారముఁ జేఁగొని
యనువునఁ దిన మనసు పడక యమృతము వోలెన్
దన యొడి దాచి కనెడి బా
లుని విధ మాయె హృదయమున లోలత నిలువన్

బంగరు పూవు సెజ్జగను భావన సేసిన నా మనంబు నిం
డం గమనీయదివ్యలలనామణులం గయి సేసికొంటి సా
రంగలసన్మనోజ్ఞ సుమరాజము నేటికి నేటి కిట్టు లీ
బంగరు సెజ్జ నింప దలపం దలఁపుల్ జనియింప వక్కటా

నీతిని జాతినిన్ విడిచి నిచ్చలు నచ్చెరువుల్ గణింప కే
దో తమి దీర నే లలనతో నయినం బెనవేయఁ జాలు నా
చేతిని వేయి ముక్కలుగఁ జేయఁగ నా మది కేల దోచె సూ
నాతతరమ్యదీధితుల యందుఁ గనుంగొన లంది నిల్వఁగన్

ఇంత బ్రతుకు బ్రతికి యింటి వెనుక చచ్చి
నట్టు నేటి కిట్లు నట్టు వడియెఁ
బ్రేమపూజలోనఁ బ్రేమ నశించెనా?
ప్రేమ మొలకలెత్తినా మనమున?

వెలయాలి వేనలి నలిగిన పూవులఁ
గొలువనే పూవింటి చిలిపిదొరను
ఒత్తిగిల్లుటలలో నత్తి నల్గిన విరు
లను తలఁబ్రాలుగఁ గొనుట లేదొ
పరిమళమ్ములు లేని విరుల దోసిళ్ళతోఁ
బడతిఁ బూజలు సేయువాఁడ గాదె
అన్యవాసితమైన వని గణియింపక
పూవుఁబోణుల ముద్దుఁ బొంద లేదొ

యట్టి విరులకన్న నంతటి నీచమా?
వలపు లెఱిగి తాకఁదలఁప నైతి
కాకదేదొ యొక్క కళ్యాణకాలమా
మనసు పొరల పయిన మసక గ్రమ్మె

దొంతరఁ దీర్ప ముద్దులను దోచుచు దోసిలి యొగ్గి సొంపులన్
బంతము వట్టి గ్రోలుచునుఁ బాయని కూర్మల రేఁబవళ్లు నం
తంతగఁ బూవునింటి దొర తంతు జయించెడి నేనె యెట్టు లా
వంతయు ముద్దు దొంతరల వైపు తలంపుల నింప నైతినే

చిననాటి చదువులం గల
గుణగణములఁ బుట్టె నిట్టి కోర్కు లనంగా
జిననాఁడు కామ శాస్త్రమె
కొనవరకును చదివి తిట్టి గుణములు లేవే

అని చింతించుచు నాత్మతృప్తి కొఱకై యా వంక నీ వంక గ
న్గొనలన్ డించుచు భావనానయనముం గోపారుణ భ్రూకుటిన్
దన యాత్మన్ నివసింపఁ జేసి కనె నాంతర్యంబునన్ దివ్యరా
గనటత్స్వానమనోహరీతరుణ రేఖాదీప్తి సాహిత్యమున్

పరవీర భీకర ప్రాభవ ప్రభువర
ప్రథిత రాజస జన్య రాజ్యలక్ష్మి
జని నిత్య సత్య ప్రశస్తి ప్రథా త్యాగ
ముజ్జాత సాత్త్విక మోక్షలక్ష్మి
కుహనా మనస్తత్త్వ కూటవాటీ నట
త్తామసోదర దూర తత్త్వలక్ష్మి
మలిన మానవ మనోనలిన రేఖా హర
త్కోమలామల దివ్య కుసుమలక్ష్మి

తాను వనిలోనఁ గాంచిన తరుణకుసుమ
సోదరాయిత సౌకుమార్యోదయమ్ము
గలుఁగఁగ నఖండ తేజ మ్మొకండు గనుల
ముంగల న్నిల్చె స్త్రీమూర్తి మూసవోలె

క్షణము నా బింబము గన సాక్షాత్తు గాను
శక్తి లేమికిఁజింతించి సత్త్వ మెఱిగి
హృదయదర్పణ మొకఁడె సంస్కృతిగ నెంచి
కాంచెఁ బ్రతిబింబ మందునా కాంత చాయ

కని కొంత తత్తరమ్మునుఁ
గొని తొల్లిఁటి మదన శాస్త్రకోవిదత మనః
ఖనిఁ బెట్రేగను కానీ
మనమున నే దివ్యకళయె మసకలఁ గూర్చెన్

పెదవి వణఁకసాగెఁ బొదివి ముద్దులఁబెట్ట
మనసు పెడచెవిపెట్టెను గనియును
కనులు నిదుర లాయెఁ గన్వెల్గు జుట్టఁగ
మనసు పెదవిని విప్పను గడఁగదు
కెంగేలు చలియించె ముంగురుల్ దిద్దఁగ
మనసు కన్నుల నట్లె యని పలుకదు
కోర్కి రేకెత్తెను గోమలి ముట్టఁగ
మఱి కొంత జతనాన మనసణఁచెను

పెదవి కన్నుల కేలులో నొదవ లేక
కోర్కి నాయకునిం జేసికొని యెదిర్చె
నప్పుడసహాయశూరత నా మనమ్మె
యెదురు కొననెంచె నెట్లైన నెగిసిపాటు

రారా! మనోహరా! కనుల రాగములం గమనింపరా! సుధా
ధారలఁ జిమ్ము నా హృదయ దర్పణముం బ్రతిబింబదర్శన
స్ఫారవిలోచనాంతముల స్ఫాటిక నిర్మల భావదీప్తులన్
జేరర యంచు నా తరుణి చీరి మరుచ్చలితాంతరంగమున్

నీరసశాల్మలీతరుల నీడలఁజేరఁగ నేలరా రసో
ద్ధారసరోజసంగతిసుధారసనీయమరందబిందు సం
చారము మాని నా కనులె చాలెడు నీ తమకమ్ముఁ దీర్ప రా
రా! రతి రాజ సుందర! యరణ్యనిపాత వినష్టిఁ బాపరా!

అని యా తేజో దీపిక
పనిచిన యొక కొంత ధైర్య భావపు నన లా
మనమునఁ బొడమిన నాతఁడు
కని కనకయు నిట్టులాడెఁ గాంతామణితోన్

ఎవ్వతె వీవు నా విరికి నెంతటి దవ్వుల నున్న దాన వే
జవ్వనముల్ ఫలింపగఁ బ్రసన్నసుమాంగత నందినావు చి
ర్నవ్వుల పువ్వుల న్నెడద రాతిని ముక్కలు సేసినావు న
న్నవ్వలి యొద్దునన్ నిలుపవా? దయఁ జూపవ? సూనసుందరీ!

అలరుంబోడి మెఱుంగు తళ్కుల పసల్ ప్రాణంబులన్ లాగ ము
ద్దుల నెన్నెన్ని విశేషరీతుల నిడం దోడైన నా వాతెఱల్
లలనాఫాలతలోల్లసత్తిలకకీలా ప్రేమసత్త్వంబొ కా
కలసత్త్వంబొ మరేమొ నీ నుదురు కన్నారన్ విలోకింపనే

నిను నా పూదోటం గని
కనికరమే లేని నలువ కన్నులఁ బడితిన్
మనమున నేదో ఘర్షణ
గొనఁజేసెను దైవ మెఱుఁగు గూర్చుట మనలన్

నా కనుదోయిం బడితివి
ప్రాకటసౌభాగ్యరేఖ ఫలియింపంగా
శోకావిలదృక్కులతో
నా కన్నుల నీరు నింపినావె సుమాంగీ

విలవిలలాడుఁ బ్రాణముల వే నిలుపంగ దలంచి చెంతకుం
బిలిచి యనేక భోజ్యములఁ బేరిచి ముందట మీద కంటి సై
గల కఱకుందనమ్ము జతగాఁ బ్రకటించుచు నంత యేని ప్రే
ళులఁ గదలంగ నీక యెదలోన బిభీషికఁ గూర్ప న్యాయమే

నా జీవన దేవాలయ
రాజత్స్మర విగ్రహములు రాణింపగ ని
న్నోజన్ రతివిగ్రహముగ
నేఁ జేయం దలచితేలనే నినుఁ గనఁగన్

అన విని యలరుంబోణి చి
ఱునవ్వు వా తెర నిలిపి మెఱుంగుల కాంతుల్
వనదమ్ము సలుపఁ దనువుం
జనవున నిటు లాడసాగె సద్గతిఁ జూపన్

తాకఁడా సౌకుమార్యాకరం బీతఁడు
ముట్టఁడా మగటిమిమూస యితఁడు
గిల్లఁడా దీర్ఘసంపుల్ల నేత్రాంభోజుఁ
డందఁడా జలజాక్షనందనుండు
ముద్దీయఁడా దివ్య మోహనమయమూర్తి
మురిపింపఁడా తేనెముద్దులాఁడు
సేవింపఁడా సుమ శ్రీశోభితాంగుఁడు
నారాధనము సేయఁడా మనోజ్ఞుఁ

డనుచు నిన్ను గాంచి నప్పు డాలోచన
వేయి గతుల వేయివిధము లాయెఁ
దుదకు బ్రతుకులోని తుదినాఁడె చేకొన్న
యీ వియోగ జలధి నీద లేక

నీదు బాహువులను నేను నౌకగఁ జేసి
దాట నెంచి రాగ దాని కీవు
మారు మాట నిడక మారుని కోటమి
నొప్పుఁగొనఁగ జూతు వొప్పె నీకు

అనుచున్ బాష్పము లుప్పతిల్లి దరహాసాంకూరముల్ దన్పఁగ
న్వనజాతాక్షి వివిక్తరాగ మురళీ నాదానుసంధాన భా
వనలం దెల్పుచు ముద్దు మోము పయినం బంగారు పండింపఁ ద
ద్వనితావాక్కరవాలదారితమనోభావోరుకాంతారుఁడై

పలికెఁ గుమారుఁడు లలనం
గల వలపును దానిఁ గాంచఁగాఁ దనలోనం
దలలెత్తుఁ దలఁపుఁ దెమ్మెర
విలసనముల భావవీథిఁ జేర్చుచు నిటులన్

మన మురియాడఁగా మునుపు మానవ కాంతల కెంతమందికో
తనువునఁ బాలుపంచితిని తద్దయ నీయెడఁ జూపకుందునే
యనువునఁజిక్కఁ గాని హృదయంబున సంశయ మొందు నిన్నుఁ గాం
చిన క్షణమందె పుట్టె వివశీకృతచిత్తుఁడ నైతి నంతటన్

అది యెటు లందువే వినుమ యందముఁ జిందెడి జవ్వనంపు సం
పద నశియింపదే యనుభవమ్ములలో నడిపింప దాని య
య్యది రమణీయ రూపమున నాదరముం బ్రమదంబు గూర్చుటల్
విదితము గాఁగ నే పగిది భీకరమృత్యుపదంబుఁ జేర్చెదన్

మునుపు ప్రేమఁ గొన్న ముద్దరాండ్రను నొక్క
రైన నేటి దనుక యంద మంత
నిలుప రైరి తుదకు వలపు నానాటికి
వేఱు రుచుల నెన్నొ కోరుచుండె

నీ యందచందముల్ గన
నా యందునఁ గలిగిఁ గోర్కె నానాటికి నీ
నీయందము చందము నిల
నా యక్షులముందు నిలుప నవ్యసుమాంగీ!

అనఁ జెలి యిట్టు లాడె నకటా! యిది నాయమె సౌకమార్యయౌ
వనపదవీవిభోగ పరిభావన నిత్యముగాఁ దలంచి యౌ
నని దరిఁజేరుఁ బూవు చెలి యాశలపందిరి గూల్చి యందులో
ననవరతమ్ము దైన్య పరిణద్ధపథంబునఁ ద్రోచి తాఁ జనన్

మునుపు ప్రేమఁ గొంటి ననుచు వచించితి
వద్ది భ్రమయె నిజమె యయిన నీవు
వేఱు రుచులవైపుఁ జేరుదువే? నాఁడు
ప్రేమ కాదు నేఁడు పిరికితనము.

నిలిచినావు కాము వలలోన నంతియె
ప్రేమపదవి కాదు పెదవి పెదవి
కలుపు టొండె ప్రేమఁగాఁ బరికించినఁ
బ్రేమ మగునె రాగధామ మగునె

ఒక గుండె లోతు నైనను
నకలుషగతి నెఱుఁగ లేవె యప్పట్టున నీ
కిక ప్రావీణ్యము గలదే
సకలసఖీహృదయ గాథఁ జక్క నెఱుఁగుటన్

సొంపులు నిత్య మటంచును
ద్రుంపక మానితివి కాని దోషము కాదా
త్రుంపుట దోషమె యన్ననుఁ
ద్రుంపగ నిన్నాళ్ళు నేల తొయ్యలుల నెఱుల్

దానికిఁ బ్రాయశ్చిత్తము
గా నను విడనాడి నాదు కాంక్షలఁ దుడవన్
నీ నవనీతసమానపు
మానసమున ధిషణ గల్గ మాన్యతయె సుమా?

సొంపుల నిచ్చలుం జూడఁగ నెంతువ
యే శాస్త్రరీతుల నేచి గాంచి
యౌవనంబున నిత్యభావంబుఁగొందువ
యే తనులతఁ గాంచి నీతి నెంచి
ప్రేమలు నీలోనఁ గ్రీడించు నందువా?
యెదలోని యే పొర నొదిగి కాంచి
నీదు జన్మములోని నిరుపమకామమ్ముఁ
బోకూర్చ నెంతు వేపొంక మెఱిఁగి

కాన నా కోర్కి తొడిమి లోలోనఁ గనుల
నేకపర్యాయ ముంచి యనేకగతులఁ
జింతనముఁ జేసి యామీద జేయి గలపి
సప్తపదముల నడువుమా చాలు బ్రతుకు

రోగ మైన జీర్ణరాగ మైనను దీర్ఘ
యోగ మైన ప్రాణ మాగ నీవు
ప్రాణ మున్నయపుడె పరతృప్తిఁ గలిగింప
నెంచు నా మనమ్మె మించు నిన్ను

కావునఁ గామమార్గమునఁ గన్నులు లేక చరించుచున్న నీ
భావన సర్వజీవితసభాభవనమ్మున సమ్మతమ్ముగాఁ
బోవునె నేఁడిదేల? వలపుల్ దలపుల్ విడనాడి నిత్యతా
భావన భ్రాంతిలోఁ బడి యభంగసుమాంగి మనంబు నేచుటల్

ప్రేమ కడలి సలిల మోమారు గ్రోలంగఁ
దరమె లవణ మోపఁ దరమె యందు
నా యగస్త్యుడైన నాపోశనం బట్ట
నెంత విశ్వ ప్రేమ నెగసె నేమొ.

భానుకిరణాల నావిరిగా నయినను
మేఘ మయినను రాపిడి మెఱుపులైన
గాలిఁ గూడిన వృష్టిగ రాలి యున్నఁ
గరకు నది చేరు తానమ్ము కడలి గాదె

ఆ నిశ్చల ప్రేమంబున
నీ నిల్చుట వట్టి మిథ్య నీతివివశతం
జానల్ చేతికిఁ జిక్కిన
సూనశరుం గొల్చు నీక? శుభకరప్రేమల్

యౌవనముతోడఁ బుట్టును భావ మందు
నన్యజీవన సంగతి నగును రాగ
మా పయిన్ సంతతిఁ గనంగ నగును సార్థ
కమ్ము నట్టి ప్రేమమ్ము నీయందు గలదె

ఇదియె స్వల్ప పరిధి యీరేడులోకాల
సకల ప్రాణి గతులఁ జాలియున్న
నదియె ప్రేమ నిజము నదిలేని ప్రేమమ్ము
స్వార్థపూరితమ్ము వ్యర్థ మయ్య

చేతఁ జిక్కినట్టి చిన్నారి చిగురాకు
పికము వెట్టు బాలపికము నోట
నటుల సకల పికము లాదరించిన నాఁడె
యదియె ప్రేమతత్త్వ మగును గాదె

విను కౌగిలించు నన్నని
మునుముందుకు రాదలంచు మోహిని నెట్లో
పని వారించుచు నతఁడా
ననమున వెల్లఁదన మొదవ నాతి కిటులనెన్

పలికితివి ప్రేమతత్త్వముఁ
దెలిసెన్ మఱి దానిఁ బడయుఁ దీరు లవేవో
తెలుపుమ నీ కౌగిలిలో
నలిగిన నా బ్రతుకు గడకు నవ్వుల పాలౌ

అనినఁ జెలి యిట్టు లనియెను
విను మా స్పృహణీయ ప్రేమ విస్తృతగతులం
గొని యొక సుందర భావన
మనమున తల్లగ్నరీతి మసలగ వలయున్

మోహకాంక్షల విడనాడి ముసిరివచ్చు
స్వార్థతత్త్వముఁ బెడఁబాసి సత్త్వదీప్తి
నొక్క యాకృతి హృదయాన నుంచి గుండె
లోతులం జేరవలయు నే బ్రాతి లేక

సాకారనిరాకారత
నా కమనీయత వసించు సాలంబనమై
చేకూరిన నా తత్త్వము
లోకాలోకముల నెల్ల లో గణన నిడున్

ఒక తావున నిర్మలమై
వికసించిన పూల తావి విదిశల దిశలన్
సకలమ్మును వ్యాపించెడి
యకలుషగతి ప్రేమ సూత్ర మగు భావింపన్

కమ్మని కౌగిలింతలను కల్మషకశ్మలకాంక్షలన్ మనో
భ్రమ్ములఁ జంచలాద్యుతుల రంజిలు మంజుల సౌకుమార్యజ
న్మమ్ములు మోహముల్ వలపు లంచుఁదలంచెడి నీకు జన్మశా
పమ్మది ప్రేమ సంకలిత భాగ్యము దక్కదు చేరు నన్నికన్

ప్రవిమలభావనాప్రభవరాగరసాభ్యుదయంబు గోర నీ
కవుగిలిఁ బ్రేమశృంఖలల గాఢత మై మఱవంగ నెంచు నా
పువు తలపుల్ వెలార్చి సరిపోలని తత్త్వ మొకండు నేర్చుచున్
దెవులును గూర్పఁగా దగునె తీయని తేనెలఁ బూవుఁజేడియన్

నాదు చెలిమి సేయ నా భావదళములె
ద్వార మగుచు వలపు జాఱుపాటు
కలుగు వేళ మనసుకడ నిల్చి మూయవే
యింకఁ బ్రేమ లారు శంక లేల

ప్రేమయె నిల్చెనే యవిరళీకృతతావకమానసాంతరో
ద్ధామములై వెలుంగును లతాంతనితాంతరస ప్రమోదముల్
సోమము త్రాగినట్లుగ నచుంబితతత్త్వము నీదు మానసం
బామనియై సెలంగు హృదయం బికఁజూడదు పైని యందముల్

కావున లెమ్ము లెమ్మికను కాని తలంపులు మాని రాగసం
భావితమానసాంతరనభస్స్థితి శూన్యతఁ బాప నేడ్చు నీ
పూవును వ్రేళులన్ నిలిపి పొందికగా నొకమారు గుండెలోఁ బావన
ప్రేమరూపముగ భావనఁ జేయుము చాలు జన్మకున్

అంతట నా సుకుమారుడు
నెంతటి ధన్యుండొ కాని యే కోరికతోఁ
జెంతకు వచ్చెనొ విరిచెలి
యంతయు గ్రహియించి యిట్టు లాడెను మఱియున్

నిక్కము నీ వచించినది నిన్నటి దాకను ముద్దరాండ్ర నా
యక్కునఁ జేర్చుటే వలపు లంచుఁ దలంచుచు నున్న నేను నీ
చక్కదనమ్ము కన్న నిముసంబునఁ జచ్చితి కాని ప్రాణముల్
దక్కిన వేటికో తెలియదాయె నదే యిపుడంతరంగమున్

తలఁచుచు నుండ నీ వనిన తథ్యవచస్సు సుధాసమానమై
కలుకుల సోయగాలె వెలగాఁ గొనినట్టి మదీయచిత్తమున్
విలిచెదు నింక నేను నినుఁ బ్రేముడి వేముడి వేయఁజాల నం
జలి యిదె నీకు నీ బ్రతుకు చక్కగ దిద్దుచు దారి చూపినన్

అన విని నవ్వి యా చెలువ యాసుకుమారునిలోని మార్పులం
గని మది సంతసమ్ము గొనెఁ గాని యొకానొక ఖేద రేఖ యా
ననమున నిల్చె నందలి యనంతమహామహిమానుభావముల్
కనుగొనె నాతఁడా కుసుమకాంత ప్రబోధ ప్రభావశక్తిచే

వెను వెంటనె యేదో తా
ననఁబోయెను కాని యాపె యంతటిలోనన్
వెను దిరిగి వెళ్ళిపోయె న
తని కలయున్ గరఁగెఁ బూర్వతత్త్వముతోడన్

కల కరఁగినంత జీవిత
ఫలితమ్ములఁ దెలియఁ గోరి వార్చుచునుండెన్
తలఁపులఁ గ్రొంగ్రొత్తలతో
విలులిత చేతమున వేయి వెల్గులదొరకై

చేతన

తెల తెలవాఱెఁ దూరుపునఁ దేటలు గట్టెను గుంకుమంబుతోఁ
గలసిన నీటి వెల్లువ లకల్మషజీవనరాగరేఖగా
వెలసెను భానుబింబ మరవిందహృదంతరదృష్ట భావనా
కలితమధుప్రియమ్ము నవకాంతిపరిస్ఫుటి నేగి మ్రోయుచున్

ముగ్ధమోహనభావమున మూతిముడిచిన
                పద్మాంతరంగమ్ము పరిమళించె
నడికి రేయి తెలివి విడి జాడ్య మూనిన
                కొలను దివ్యోద్దీప్తి పొలయ వెలసెఁ
గన్ను మిన్నుఁ గనక కాల్సాగి రేగిన
                తెలిమంచు కణముల తెరలు చీలె
నిద్రఁ గూర్కిన ప్రజన్ నిర్ణిద్రచైతన్య
                సంపత్పరంపర తెంపరిల్లె
రాజు విడనాడె సాత్త్విక రాజసమును
వలచె రాజససత్త్వముం బద్మసఖుఁడు
దిగ్విదిగ్వ్యాప్త చైతన్యదీప్తి యొకఁడు
లేచి నడయాడ సాగె నేలీల వలనొ

లోఁగల రాగభావనములుం బరమార్థ విహీనతత్త్వముల్
రేగిన మూఢతామహిమలీలలు వే నశియింప భాను రు
గ్భాగవినిర్మలత్వము నభంపచతాపము సర్వవిచ్ఛిన
ద్వేగము పర్వఁ గన్గవను విప్పె నతండు ప్రభాతవేళలన్

అంత యద్భుతమ్మె యా కన్నుఁగవలోన
దానిలోని చూపువానలోన
వానిలోని భావవార్ధి విభంగాల
వానిలోనెడంద నైన గాని

ఇంతకు మున్ను నే యెడఁద నే దెసఁ జూచినఁ బువ్వుఁబోణిలే
చెంతకుఁ బిల్చి నట్టుల హసించిన యట్టులఁ గౌగిలింతకై
పంతముఁ బూని నట్టుల సెబాసని కన్నుల మెచ్చి నట్లుగాఁ
జింతయొ యా మనంబు గనెఁ జేరువులన్ బ్రణయైక జీవులన్

ఒక లీలగ నొక హేలగ
నొక జాలిగ నొక్క కరుణ మొక రసమనఁగా
నొక యింద్రజాల మనఁ దుద
నొక కలగా రేయి విషయ ముదయించె మదిన్

నడి రాతిరి కలలోఁ గనఁ
బడి యలజడి రేపి యెటకొఁ బయనంబై వీ
డెడి యా చేడియ యొక పరి
సుడియుచుఁ గనిపించెఁ గనుల చూడ్కులె యలయన్

పులుగడిగిన యెద యద్దము
కలలోఁ గనిపించినట్టి కాంతాసుమముం
గలయఁగఁ గని ప్రతిబింబము
వెలయఁగఁ గొన సిద్ధపడుచు వీడె శయనమున్

వీడి సుమాంగి వల్కినయవేలమహామహిమానుభావనల్
జాడలు సూపఁగాఁ బరువులం గొనెఁ బూపొదరింటి మాటునన్
వేడుచు నిన్న నిల్చిన మనీష వెలార్చిన పూవుఁబోణిఁ దో
డ్తోనఁ జూడఁగా మనసు తొందర వెట్టఁ గురంగసద్గతిన్

అచటి కేగి చూడ నంతయు వింతాయె
నిన్న నున్న తలఁపు మన్ను గఱచె
నేదొ క్రొత్తఁదనమె యేదెసఁ జూచినన్
దోఁచె వానిమనసు దోఁచె నపుడు

అటు మాలతీలత యరవిచ్చి నెనరిచ్చి
పల్కరించెను విశ్వప్రణయగీతిఁ
జేమంతి విరఁబూచి చేఁజాపి తలయూపి
కన్నుగీటెను జగత్క్రాంతిరీతి
ముద్దమందారమ్ము ముద్దుగఁ బాడెను
విశ్వవీణారాగవీథి భాతి
సన్నజాజిలతిక మన్నులే తెన్నులై
నిలిచె బోధించు చనిత్యదీప్తి

పూలగములనుండి జాలువాఱెడు తేనె
వాఁక లన్ని నేల వ్రాలె నపుడు
మన్నుమింటి కైక్య మున్నట్లుఁ దెలుపుచు
మధ్య నున్న దంత మిథ్య యనుచు

లలిత లలిత భావ కలిత లతావళుల్
సరులు లేని తలఁపు విరుల విరులు
నలల వలెను వెలలు నల పూవుఁదేనియల్
విశ్వరాగగీతి వినిచె నచట

మనసు మఱిఁగిపోవ మౌనగానంబులఁ
గనులు కరఁగిపోవఁ గమ్రగీతి
నట్టు నిట్టు తిరిగె నాసుకుమారుండు
మారుఁ దూరు విడిచి పారిపోవ

తిరిగి గిఱ్ఱు మనుచుఁ దిరుగఁగ భావనల్
గనుల మనసు నాత్మ కలిసి కలయఁ
గాంచి తోట నిటులఁగాంచెను లోలోన
లోనలోన నేదొ లీన మగుట

ఇది యేమి! యీ వింత యింత కమ్మని తోట
నిన్న మరోరీతి నేను గంటి
నిది యేమి? యీ క్రొత్త యింత చక్కని బాట
నిన్ననే వంకనో నేను గంటి
నిది యేమి? యీ చెంత నింత తీయని పాట
నిన్ననే యపశ్రుతి నేను వింటి
నిది యేమి? యీ పొంత నింత తీపులపంట
నిన్న నే చేదునో నేను తింటి

నహహ! యిది యేమి? యీ వైపు నందగించు
జిలుగు చిన్నారి విరిచేడె పులకరించి
కళల వెదఁజల్లెడు నిరునల్గడలయందు
నన్ను మాత్రమ్మె కనినట్లు నిన్నుఁ దోఁచె

ఇటు మల్లెపూబాల లెగఁజిమ్ము వెన్నెలల్
తారలై జీవనాధార మగుచు
నీ వైపు మందార మెదఁజల్లు గెంపులన్
సంజయై బ్రదుకున మంజు వగుచు
నీ చాయఁ గేతకి యెగఁద్రోయు వేడుముల్
భానుఁడై శివమనోదానముగుచు
నీ వంక విరజాజి యిది యేమి? తెలియదె
యొక సత్త్వ మూర్తియై యులికి పడుచు

నౌర యీా రీతి నీ తోట నమరె నెట్లు
ప్రకృతి చాంచల్యమా? లేక పరవశించు
ప్రణయ సౌందర్యమా? కాక రగులు నట్టి
మనసు పడునట్టి వేదనమా? యెఱుంగ

అరెరే? యేమిటి? యేమిటీపగిది నౌరా! యెంతగా మార్పు లె
వ్వరు తత్కర్తలు? కారణంబు నెదియౌ? భావంబ జీవంబ యే
కరణిన్ నేర్చెదు? నేర్పువా రెవరు? నా కన్గోనలం గాన నీ
సరణిన్ వార్ధితరంగభంగ సమసంస్కారంబు నన్గెల్చెడిన్

తలిరాకుఁబోడి నాకయిఁ
దలనూపుచుఁ బిల్వదేమి? తలపుల వల లో
గిలిఁ జిక్కనితనమా? తా
వులు నల్దెసలఁ బ్రసరించు పోడిమి ఫలమా?

అటఁజని సోలిపోవుదున యా మకరందపు సోనలందునం
బటుతర రాగవీచికల నాట్యములాడు లతాంగి చెంగటన్;
విటపవనీవిహారములె వ్రేగయి నిల్వ మనంబులోన నె
చ్చటనొ చరించు నట్టి మధుసౌరభసౌగతభృంగనాదముల్

సహకారము రసజీవము
సహవాసము రాగమయము సహభావగతిన్
సహచరణము భవతరణము
సహవిశ్వప్రేమగీతి సౌహృదఫలమున్

అనుచు వినిపించె, మెల్లఁగఁజనుచు గాలి;
గాలితాకున నా మేను సోలె నంత
వీణ మీటిన రీతిగ జాణతనము
మీర సెల జారి నట్లుగ మారె మనసు

ఆఱు నూరయినను నూరు నాఱయినను
బూవుఁబోండ్లు పుణ్యజీవ మణులె
కాక క్రమశోభఁ గాంచియుఁ గరుణతో
నలరుతత్త్వ మెట్టు లరయఁగలరు

సద్యః ప్రస్ఫుటదంబుజాతనివహోత్సాహంబు సౌహార్దభా
వోద్యత్పంచమసుస్వరప్రణయలీలోన్మాదియౌ కోకిలా
హృద్యత్వంబు విదిగ్లసల్లలిత వల్లీహావిశేషంబు స్వ
ర్వేద్యానూనమహావనిన్ హృదయతన్త్రీ జాతమున్ మీటెడున్

ముని పెదవులను మున్ను కాముని పదములె
పాడి తపియించి నట్టి యా ప్రణయమూర్తి
లో నెడందను లోలోన లోన లోన
విశ్వప్రణయోర్మి గీతికావీణ మ్రోగె

కరయుగంబున దివ్యకరుణాపృషత్కంబు
    నరనరంబున స్పందనమ్ముఁ జూపెఁ
బదపదంబున విశ్వభావసంవేగంబు
    నణువణువునఁ జేతనను వహించెఁ
గన్ను గవయు రాగగానామృతమ్ము వె
    న్నెలలను వెదఁజల్లి నిలిచె నంత
వినుకలియును సర్వవిశ్వప్రబోధమ్ము
    గగనమంతగ నిల్వఁగా వహించె

స్పర్శకుఁ బరీక్ష వెట్టఁగఁ బరవశించు
సుందరాంగులు స్పృశియింపఁ జోటు లేదు
తనువె యిటులుండ నతని యంతరము మాత్ర
సార్థకం బైన భావశూన్యతనె పడసె

మొయిలుగమి మేలిముసుగున హొయలు చూపి
చపల కనుగీటి వచ్చినన్ చపలుఁ డగునె
విశ్వచంద్రిక వెలయించు వెన్నెలదొర
స్వార్థతత్త్వముతో దాని వంకఁ జనునె

కలువతో నెంత స్నేహమ్ముఁ గలిగి యున్న
మృదుకరస్పర్శ మాత్రమే హృదయమందుఁ
గలువకన్నియ వలపులు నిలుపు కొనఁడు
దానికై యెంత మాత్రమ్ము తపనఁగొనఁడు

వెన్నెలలఁ గాంచి జలజమ్ము విరియలేక
మూతిముడిచిన ద్వేషముం బూనఁబోడు
వెన్నెలల భేదభావమ్ము వెలలఁబోడు
కలువ యొక్కటె? తనవైరి కమల మొకటె?

కలువకన్నెలకే గాదు కనుల నపుడ
విచ్చు పసికూన లైనను మెచ్చు రీతి
తాను వర్తింపఁగలుగు నాధ్యాన మొకఁడె
జీవతత్త్వమ్ముగా నెంచు భావుకుండు

అట నా వెన్నెల నొక్కడే తినినచో నంతారసోత్పత్తికై
పటుసౌహార్దముఁ బంచి పెట్టఁదగు భావంబుల్ జనింపంగ నే
నటనాశిల్పవిశారదుండు భవ మందం జాలునో జాలి చూ
పుటకై ముందుకు దూకి సర్వజగతిన్ మోదంబుఁ దా నింపునో

తగుట కీలాలబంధమే తల్లి దండ్రి
సర్వసంతతి నొకటిగ సాకఁగలరు
జీవసంబంధ మున్న యా జీవతతిని
నొకటిగం జూడఁ బ్రేమమ్ము నూనవలదె

అని చింతించుచుఁ జనసా
గెను వనిలోపల మును తిలకించిన కుసుమం
బును నేఁడునుఁ జూడఁగ భా
వనఁ దెలియఁగ నతఁడు వేగవర్ధితపదుఁడై

దీప్తి

ఒక్క నిమేషకాలమున నూపిరు లెన్నియొ తీయు మిత్తి తా
నొక్కదినమ్ము చిక్కినపు డూఁదుకపోవుచు జీవనాడులన్
నిక్కుచు నెందరో యమృతనిర్మలబిందుకవోష్ణ బాష్పముల్
గ్రక్కినఁ గాని జీవకళఁ గన్పడఁ జేయ దదే యుగంబునన్

నవవసంతుడు వచ్చి నవ్వింప నెంచిన
మల్లిక కన్నీరు మాన దయ్యె
గంధర్వు లెందఱో కలిసి ప్రార్థించినఁ
గోయిల గళమిచ్చి కూయ దయ్యెఁ
గొమ్మలు పూవులుఁ గోరి కాళులఁ బడన్
బుడమి మౌనపదము విడువ దయ్యెఁ
గుసుమాసవము నింపి కొలువుండఁ గుసుమముల్
గ్రోల మధుకరముల్ వ్రాల వయ్యె

ఆకుఁ గదల దాయె నామని యో మూల
మూతి ముడిచి నిలుచు ముచ్చటాయె
హేతు వేమొ కాని యే పంతమో కాని
యన్ని చూపు లచట మన్ను గఱచె

ఆ విరితోటలో నొకట నంతయు నిట్లు రహింప మెల్లఁగా
భావనఁ జేసి యా తరులు పావనజీవనరాగరేఖకుం
దావల మైన యీ వనమునన్ జనియించె విషాదభావనా
గ్రావము లేటికో తెలియఁగా వలె నింతటి వింత యేలనో

అని యా భూరుహజాత మంతయును తథ్యం బాకళింపంగ వెం
టనె యా మూలకుఁబంపె దూతల నదంతం జూచి చర్చించి ర
మ్మని పుష్పంబులఁ దావులన్ ననల రెమ్మల్ పండుటాకుల్ సమీ
రణముల్ పుప్పొడి రేణువుల్ భ్రమరముల్ రమ్యాంతరంగంబులన్

పోయిన కుసుమంబు పోయినట్లాయెను
వచ్చినన్ వాసనల్ చచ్చిపోయె
వెళ్ళిన రెమ్మలు వెళ్ళిన ట్లాయెను
వచ్చినం బర్ణముల్ వాడిపోయెఁ
జనినట్టి ననలును జనినట్టు లాయెను
వచ్చినన్ విరఁబూయ మెచ్చ వాయెఁ
దరిలిన పుప్పొడుల్ దరలిన ట్లాయెను
వచ్చినం దమకంట బాష్పమాయె

పండుటాకుల కచ్చటే వల్లకాడు
షట్పదమ్ముల కదియె నిశాబ్జకార
గాలి రాలేక చనెను దేశాలు పట్టి
యంతరంగాలు మాత్రమే యరుగుదెంచె

అవి గుండెల్ చెరువైన రీతి కనులం దా కృష్ణవేణీతరం
గవిభంగంబులు వెల్లువైన పగిదిం గారుణ్యసద్భావసం
భవకల్లోలిని వేల దాటు విధిగన్ భావాలసత్ప్రేమతం
తువు నే హేతువొ చిక్కువడ్డ గతి నెంతో దీనమై యిట్లనెన్

తెల్లవాటి నంత నెల్ల తోటయు మేలు
కొనెను పూవు తావి కొమ్మ రెమ్మ
నేల నింగి తీవె గాలి మఱేవేవొ
కాని యా సుమమ్ము కన్నుమూసె

విరిసెను సంజలోఁ గనులవిందులఁ జేయుచు మంజుభావనాం
తరపరివర్తమానమమతానమతాప్రణయార్త మూర్తియై
పరిపరిరీతులం గుముదవల్లభు తాకిడి నోర్చియున్ దివా
కరకిరణాళిఁ జూచుటకుగా నయినన్ గతిలే దాయెనా?

శవముపై నిల్చి నట్లై జాలు ఫలము
కడకుఁ గడఁదేర్చు చోటికే కాలు కదలు
శవముగా మారి కడఁ జేర సౌరు కదపఁ
గటకటా? యేటి కీ జన్మ కలిగెఁ దనకు

విరిసిన కర్ణికార మరచిచ్చిన తెల్లని మల్లెమొగ్గ లో
విరిసిన సన్నజాజి పదివేలు వచింపగ నేల నీచమై
విరిసిన గడ్డి పూవు కనువిందులఁ చేసి క్షణమ్ము నిల్చి సుం
దరతరజీవితమ్ము బహుధాపరిపూర్ణముంజేయ వెంచవే

పడతిగోట గిల్లఁబడుట ముక్తికి నాంది
సూది గ్రుచ్చ పెరుగుచుండుఁ దపము
వారి శిరములందు వాడిపోయిన యంతఁ
బాఱవేయ నదియె పరమపదము

ఐన నేమాయెలే తానె యంత మైనఁ
దావి పదిమందికిని బంచఁ దపము గెలిచె
తనువుతోఁ బాటు తావియుఁ దరలిపోయె
గత చరిత్రలో నొకపుట కరఁగి పోయె

పలుపలురీతు లిట్లు సుమభక్తతరువ్రతతీతరుల్ గుబుల్
సెలఁగఁగ గుట్టఁ గ్రుక్కుకొని చెప్పిన పల్కుల విశ్వ మెల్లడం
దెలియఁగఁ జేయఁగం దలఁచె నేము యెఱుంగగ లేము కాని యా
మలయసమీరణుం డఖిలమార్గములం బరువెత్త సాగెఁదాన్

ఆ గాలిపొరలె నీరై
క్రాగిన వా వన్నెకాని కనుఁగవలోనన్
సాగుచు నా వల్లికదరిఁ
జాగిలపడి మ్రొక్కు నలరు జవ్వనిఁ గనఁగన్

పుష్కరావర్తకంబులు గంట నిలిచినఁ
గనురెప్పలు నెమళ్ళు కాకపోయెఁ
గుధరముల్ శతకోటి గుండెల నిలిచినఁ
దలఁపులు గజములై చెలఁగ వయ్యెఁ
జరణకీలాల మావిరి యైనఁదేలుచుం
బదములు మృగములై పాఱవయ్యె
సకలావయవములఁ జలనము దొలఁగినన్
మది ప్రస్తరమ్ముగ మార దయ్యెఁ

బ్రాణములు మాత్ర త్రుటిలోనఁ బరమపదము
సాగుచున్నట్టి విరితోడ సంగమించి
యేమి మాటాడి వచ్చెనో యెఱుఁగలేము
కడకు నతనిలోఁ జైతన్యకళ జనించె

తజ్జాడ్యస్థితి సంపుటీకృతహృదంతస్తత్త్వ మేపాటిదో
మజ్జద్భావపరంపరోద్ధృతసుధామాధుర్య మేరీతిదో
సజ్జీభూతహృదంతరంబుఁగొని యే సౌహార్దముం దీర్చెనో
యొజ్జౌ ధాత యెఱుంగఁజాల మతఁ డుద్యోగించె నీ తీరునన్

వడి వడి తడఁబడు నడుగులఁ
గడఁజని భూమాత యొడిని కదలక పడి యుం
డెడి తన విరి నెచ్చెలిఁ గని
యొడలెల్లనుఁ బులక లెసఁగ నూహించె నిటుల్

నిన్నటి రోజు నా హృదయనీరజపత్రము లొక్కటొక్క డే
తెన్నునొ సాగఁజేసి యతితీవ్రతరంబుగ మర్మఘాతివై
మన్ననబాటఁ జూపి మటి మానిని వోలెను స్వప్నమందు నా
కన్నుల విప్పి తీ పగిది కాటికిఁ గాళులఁ జాచి యుండియున్

తన ప్రాణంబులు పోవుచుండట యనంతమ్మైన యీ సృష్టిలోఁ
దన కింతైనను తావులేమి యొక గాథన్ స్వీయజన్మంబు నీ
వనిలో నిల్చు టెఱుంగునో యెఱుఁగదో బంగారు రంగారు చే
తన నాలో జనియింపఁజేయఁ గలిగెం ద్యాగైకభావాత్మయై

క్రిములుం గీటకముల్ లత ల్దరువులుం గింజల్కముల్ పుష్పొడుల్
సుమముల్ వాసన లాకులున్ పురుల విచ్చున్ హృచ్చినద్భావ రా
గముఁ బల్కించు నిజంబు గాఁగ భ్రమలం గల్పించు నేదైన ని
త్యముగా నిల్చెనె నిన్న నాదు మదిలో నా భావ మేమైనదో

పుట్టుట కేమి స్త్రీపురుషభోగమె పుట్టుక హేతు వౌట నా
పట్టు లతిక్రమింపగ స్వభావము నొప్పని దౌట నింతకుం
బుట్టిన వెన్క మంచితనమున్ సమకూర్చుచు తేనెపట్టుగం
బెట్టినఁగాదె యందరును మెచ్చుట కీరితి నిల్చియుండుటల్

అని తలంచి నిలువ నా కంటిపాపలో
మొయిలు లేక మిగుల ముసురు పట్టె
నెపుడు త్రాగె నేమొ యెందు దాగిన వేమొ
చిన్ననాఁడు తిరుగుచున్ననాఁడు

కీకారణ్యమునందుఁ బుట్టి మమతాకీలాన హృత్కర్తనై
కాకారంబును బొంది గుండె గుబులున్ హత్తించి మున్నెన్నడున్
శోకం బన్న నెఱుంగ లేని యెదయందు న్నీరు పుట్టించె నౌ
రా! కర్తవ్యకరాల హేతిహతులం దాంతర్యగాంభీర్యముల్

రాలి వాడిపోయి పేలవంబై యున్న
యలరు విరియఁ జేయ దలఁపు కలుగ
నమృత హృదయమూర్తి యశ్రువుల్ రాల్చినన్
విరియ దెట్టి మృత్యగరళ మహిమొ

కలిగిన కంటినీరు కొడిగట్టిన గుండెల మీద రాల్చినన్
ఫల మది యేమి? రాగముల పల్లవముల్ జనియించునే యటం
చలసి తదీయపాదములయందె యనంతప్రశాంతరాగసం
వలితము బాష్పబిందువును వ్రాల్చెను దానికె యంకితమ్ముగన్

ఏడ్చి యేడ్చి తుదకు నేడ్వఁ గన్నీరును
కనుల నింకిపోయి కలఁతఁ బెట్ట
మదిని వెల్లి విరియు మధుర భావఝరులు
నడుము కట్టి ముందు నడిపె నతని

తరువు బ్రతికి యున్న తరుణానఁ బాదులన్
జలముతోడ నింపఁ ఫలము గలుగు
చావుగొన్న వెనుక సంద్రముల్ దరలించి
నన్ ఫలంబు గల్గునా ధరిత్రి

కుంటియైనఁ గాని గ్రుడ్డియైనను గాని
మూగయైనఁ బండుముసలియైన
బ్రతికియున్న యపుడె పట్టెడన్నము గాని
పిదప నెంతఁ జేయ నెది ఫలమ్ము

ప్రణయము రంగరించి మధుపాత్రను నింపి యొకొక్క బొట్టుగన్
జనతకుఁబంచి పెట్ట సుఖసాంద్రమహేంద్రధనుఃప్రరోచులై
తన మమతల్ దిగంతముల దాకను సాగుచు విశ్వప్రేమజీ
వనరమణీయగీతములఁ బాడినచో నది జీవితం బగున్

ఎపుడు చచ్చె ననుట యేరికి నెవరికి
నెట్లు పోయె మీద నేమి చేసి
పోయె ననెడి ప్రశ్న వేయఁగాఁ దగు జన్మ
ధారవోయ వలయు దాని కొఱకు

నదులు గిరీంద్రకోటి జననంబును బొందియు విశ్వప్రేమమై
కదలుచు నూరు వల్లెలను కాలువలై ప్రవహించుచుండి సం
పదల జనింపఁజేయుచును బాపము తాము కృశించిపోయి యా
పదలను మోయుచుండు నవి పాడెడి పాటలు నీటి మూటలా!

కాలమును వెళ్ళఁబుచ్చుట గాదు బ్రతుకు
నీ నిమిత్తమ్ము లేకయేఁ దాను జరుగు
కాల మొకత్రుటి స్వర్ణ శృంఖలల వేసి
నిలుపఁ గలిగిన నీ జన్మ విలువఁ గనును

గుడిగోపురంబులు గుదురుఁగఁ గూర్చుండి
చిఱుగంట మ్రోతలఁ జెప్పు నేమి?
నిలువెత్తు సెగలతో మలమల మాడుచు
వెలుఁగిచ్చు దివ్వెలు దెలుపు నేమి?
తీవెపుట్టువు పూవు తావి నల్గడలకుఁ
బంచి పెట్టుటలోని భావమేమి?
విడిపోని తలపుల ముడిపడి సుడియుచు
స్నేహతంతువు దాను నేర్పు నేమి?

తొలిని సార్థక్యమునుఁ బొందఁ గలుగుటయును
బిదపఁ బదిమందికొఱకుగ బ్రదుకుటయును
వేఱువేఱు పదంబులఁ జేరియున్న
భావమున మాత్ర భేదమ్ము వలదనుటయు

అట్లు భావించి తన చేత నలరునలరుఁ
గన్నుదోయిని స్పృశియించి క్రమభావ
భావితాంతరుఁడై తత్ప్రభావ మరసె
గతజలంబుల సేతువుఁ గట్టినట్లు

విరగఁ బూచిన తరువుల విరులలోనఁ
గొన్ని వాడును మఱికొన్ని మన్ను గఱచుఁ
గొన్ని ఫలియించు మఱికొన్ని కొలువుదీర్చుఁ
గాని తన మేలు నొక్కటి తలఁప దెపుడు

ఎదిగి పోవని యెదలోని నొదిగిపోయి
పలుకరించుచు నాకంటిపాప నిలిచి
చూచితిని నిన్న కాని నా చూపు గలియ
వలసె నింకొక్క జన్మ యీ కలన వెలసె

గాలికి రెప రెప లాడుచు
సోలుచు నున్నట్టి యెడఁద సుందరతరదీ
పాలను వెలిగించితివే
యేలిక నా బ్రతుకు కూలెనే యను బాధల్

అమ్మా! నీ జీవిత మిఁక
వమ్మనియెడి సంశయమ్ము వలదు వలదు ప్రే
తమ్మును బ్రతికించితి వమ్మ
తమ్మునుఁ గురిపించి యదియె ధన్యత జనికిన్

విను సుమబాల నిన్నుఁ గొని వేల్పుల కర్పణఁజేసి నీదు జ
న్మను సఫలంబుఁ జేయగ మనంబునఁ గోరితి నిన్న గాని మ
న్ననఁ బడిపోతి వీవు మును నోచిన నోముఫలం బదేమొ యై
నను వ్యథ లేల యీ పగిది నన్పూజియించుట నీవె వేల్పు గాన్

ఒక్క దీపమ్ము వెలిఁగింప నొక్క శక్తి
వేలకొలఁదిగ దాన దీపాలు వెలుఁగు
స్నేహమును నింపి నా యెదఁ జింత యనెడు
దశను వెల్గించితే వెల్గు తరలు నింక

అనుచు నాతఁడు కలతుద నా సుమాంగి
వదనమున నిల్చిన విషాద భావములకు
బదులు పల్కుచు నున్నతపదమునందు
దాని నిలిపెను జీవితాధ్యానబుద్ధి

అతని మనోగతిం దెలిసి యాంతరమందు హసించె నేమొ యా
లతికలు నా తుషారమకరందపరిచ్యుతి బాష్పబిందుసం
తతి విడినట్లుఁ దోచె ననుతాపవితప్త హృదంతరంబులో
వెతల నెఱింగి నంత శరవేగమునన్ మనముల్ ద్రవింపవే

వెనుఁదిరుగఁగ మారుండు న
తని మనమునఁజోటు లేక తనదారినఁ దాన్
వెనుదిరిగెను సుకుమారుఁడు
కొని సుమమును నిట్లు వెలలు కూర్మితలపులన్

ఏ పూలతావులు నేపారుఁ జిఱుతల
చిఱునవ్వు వెన్నెలల్ చిలుకుచుండు
నే ఝురీనినదాలు నిహపరశాంతిసం
గీతమాధురు లల్లఁ గేళిసలుపు
నే చిఱుగాలులు నేవేవొ గుసగుసల్
పలికి యాధ్యాత్మిక భావ మొసఁగు
నే కొండ గుహలను నేకకంఠంబుగా
నోంకార ప్రతినాద మొరయుచుండు

నే నదంబులఁ ద్యాగమే యేపుగాంచి
సకల కేదారములలోన శకలితమగు
నట్టి వానిలో నొకదాన నైన నాకు
నింత చోటున్నఁ జాలదె యీ జగాన

ఏ మేఘమాలిక యీ లోకమును గాంచి
నిత్యమ్ము వ్యథను కన్నీరు గార్చు
నే తటిద్వల్లిక యీ లోకమును గాంచి
ప్రాణమ్ములన్ రోయు భంగవడుచు
నే గిరిశిఖరమ్ము లీలోకమును గాంచి
మధ్యన విరిగి సమాధులగును
ఏ నదీనదములు నీ లోకమును గాంచి
పలుమారు శుష్కించి వంతనొందు

నే సరస్వస్తమును గూడ నిట వసించి
గుండెబ్రద్దలుగాఁగను ఘోష వెట్టు
నట్టి వానిలో నొకదాన నైన నాకు
నింత చోటున్నఁ జాలదే యీ జగాన

ఏ యెడారులలోన నే నాటి కైనను
మంచి ప్రతిధ్వనుల్ మించి పలుకు
నే మృతజీవుల యీహ నీనాటికిఁ
ద్యాగభావంబులు సాగి యుండు
నే యస్థిఖండాల నీ నాటి కైనను
విశ్వమానవ ప్రేమ విరిసి యుండు
నే భస్మవాటిక నే నాటి కైనను
సత్యలతాంతముల్ నృత్య మాడు

ఎట్టి పరమాణువులలోన నిహపరాల
సంధిసౌహార్ద మార్గముల్ చాగి యొప్పు
నట్టివానిలో నొక దాన నైన నాకు
నింత తావున్నఁ జాలదె యీ జగాన

గుండెలోపల లోలోన గూడు కట్టి
నిలిచి యున్నట్టి స్నేహమ్ము వెలికిఁ దీసి
జీవితపుఁ బాత్రలోఁ బోసి చేదు విఱిచి
యందఁ జేసిన జనుఁడె ధన్యాత్ముఁ డగును

కరుణఁ జిలికించుఁ గన్నులు కమలుచుండు
రాగ మొలికించు హృదయమ్ము రగులుచుండు
భావశూన్యత యపరంజి పాటపాడు
కాలవీణనుఁ దంత్రులు కదలినపుడు.

సుమనస్కుని పయనం

జననం	:	03-06-1951, నెల్లూరు
తల్లిదండ్రులు	:	కడయింటి శేషమ్మ, సూరం హనుమంతయ్య
విద్యాభ్యాసం	:	20 సం॥ వయస్సు వరకు నెల్లూరులోనే
ప్రాథమిక విద్య	:	1-3 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, అత్తితోట అగ్రహారం 4-5 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఉస్మాన్ సాహెబ్ పేట
ఉన్నత విద్య	:	6-8 తరగతి - వి.ఆర్. హైస్కూల్ 9-ఎస్.ఎస్.ఎల్.సి. - వేద సంస్కృత పాఠశాల - 1967, మూలపేట
కళాశాల విద్య	:	సాహిత్య శిరోమణి, వేద సంస్కృత పాఠశాల – 1967, మూలపేట (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రథమ స్థానం)
ప్రైవేటుగా	:	పి.ఒ.ఎల్. 1975, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. భాషా ప్రవీణ 1976, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. (సంస్కృతం) 1977, ఆంధ్ర విశ్వకళా పరిషత్. ఎమ్.ఎ. తెలుగు 1978, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. పి. హెచ్.డి. 1986, ఆంధ్ర విశ్వకళా పరిషత్ వాల్తేరు.
ఉద్యోగం	:	1971 - 1972, ఎన్.వి.ఎస్.ఓ.ఎన్. స్కూల్, చేకూరపాడు, ప్రకాశం జిల్లా.

లెక్చరర్ : 1972 - 1976, ఓరియంటల్ కాలేజ్, ఏలూరు &
ఓరియంటల్ కాలేజీ, చిననింద్రకొలను.
1976 - 1080, ఓరియంటల్ కాలేజీ, పొన్నూరు.

ప్రిన్సిపల్ : 1980-1990, ఓరియంటల్ కాలేజీ, తాడికొండ.
1990-2009, ఓరియంటల్ కాలేజీ, తిమ్మసముద్రం

పార్ట్ టైమ్ లెక్చరర్ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (1 సంవత్సరం)

Visiting Fellow : రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి. (2008-09)

Adjudicator : For Several Dessertations Submitted for Ph.D

పురస్కారాలు :
- ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథం బహుమతి - 1979 'సంస్కృత భాణ సాహిత్య' గ్రంథం
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమాధ్యాపక బహుమతి-1981
- తెలుగు వెలుగులు - శ్రీనాథపీఠం-1987
- పుష్పకిరీట సన్మానం, చెన్నై
- ఉగాది సాహితీ పురస్కారం, లలితకళా పరిషత్, చీరాల-2001
- బహుముఖ ప్రజ్ఞా పురస్కారం, సహజ సాహితి చీరాల-2009
- 1970 (విద్యార్థి దశ) నుండి వివిధ ప్రాంతాలలో అవధాన సభలలో సన్మానాలు, బిరుద ప్రదానాలు.

వృత్తిపరంగా నిర్వహించిన బాధ్యతలు

1. Member, Academic Council, Prof. Nagarjuna University.
2. Member, Academic Senate, Prof. Nagarjuna University.
3. Member, Board of Studies in Oriental Languages, Prof. Nagarjuna University.
4. Adhoc PG Board of Studies (Sanskrit), Prof. Nagarjuna University.
5. Person, Refresher Courses
6. P.R.O., Oriental College, Resource Teachers Association (AP)

ప్రచురణలు

1. సౌమనస్యము (ఖండకావ్యం - పద్యం) - 1979
2. సున్నితపుత్రాసు (వచనకవితాసంకలనం) - 2002
3. సంస్కృతభాణసాహిత్యము (విమర్శ)
   (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహూమతి 1979)
4. సంస్కృతప్రహసనసాహిత్యం (విమర్శ) - 1986
5. Hasya and Prahasana : A Critical Study (Ph.D..thesis) - 1989
6. మత్తవిలాసప్రహసనము - తెలుగు అనువాదం - 1974
7. పూజాకుసుమమ్. (రేడియో నాటకం..సంస్కృతం) - 1987
8. కరావలంబమ్. (,, ,,) - 1985
9. ధూర్తానుభవభాణః (సంస్కృతం)
10. గురువరరంజనభాణః (,,)
11. కవిజనమండనభాణః (,,)
12. నటసమాగమభాణః (,,)
13. నికష(విశ్వధర్మవాణ మాసపత్రిక సంపాదకుడుగా వ్రాసిన
    సంపాదకీయాల సంకలనం) - 2009
14. రుక్మిణీశవిజయమ్ (సంస్కృతమహాకావ్యానికి విస్తృతంగా తెలుగు వ్యాఖ్య)
15. శివానందలహరికి జ్యోతిష్మతీ వ్యాఖ్య
    (సంస్కృతంలోనే - వ్యాకరణవిశేషప్రస్తావనతో) - 2020
16. భవానీ భారతి (అరవిందుని సంస్కృతకావ్యానికి తెలుగు వ్యాఖ్య) - 2019
17. దశావతారస్తోత్రమ్ (వాదిరాజతీర్థరు రచనకు తెలుగువ్యాఖ్య) - 2019
18. కుమారసంభవమ్(కాళిదాసరచితమ్) (అష్టమసర్గ - తెలుగులో వ్యాఖ్య) - 2021
19. రాధాషోడశ నామస్తోత్రం (అర్థతాత్పర్యాలు) - 2020
20. భారతనిరుక్తి – నన్నయరుచిరార్థసూక్తి - 1983
21. భారతనిరుక్తి - తిక్కన సరసోక్తి
22. భారతనిరుక్తి - ఎఱ్ఱన ధర్మోక్తి
23. జనహిత వ్యాఖ్య (ఆంధ్రమహాభారతము - విరాటపర్వము) - 1989
24. జనహితవ్యాఖ్య (ఆంధ్రమహాభారతము - ఉద్యోగపర్వము) - 2000
25. జనహితవ్యాఖ్య..(నిర్వచనోత్తరరామాయణము - తిక్కన) - 2005
26. వ్యాసమహాభారతం - తెలుగువచనం - 2010
    (వ్యాసభారతానికియథాతథానువాదం) 20 సంపుటాలు(6000 పుటలు)

27. మహాభారతము — తెలుగు
(మూలం..అనువాదం..విశేషాంశాలు..గీతాప్రెస్..గోరఖ్ పూర్ ప్రచురణ)
A4 సైజులో. 7.సంపుటాలు..7250 పుటలు - 2018

28. శ్రీమహాభారతము(సంస్కృతం) విరాటపర్వము
(జనహితవ్యాఖ్య - తెలుగులో - గీతాప్రెస్,గోరఖ్‌పూర్ ప్రచురణ) 2005

(20 - 28 గ్రంథాలకు సహరచయిత డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి)

ఇతరాలు:

1973 నుండి ఆకాశవాణి ద్వారా సంస్కృత పాఠాలు, సంస్కృత ప్రసంగాలు కథలు, ఏక పాత్రలు, సూక్తి సుధ, సద్వాణి, తెలుగు సాహిత్య ప్రసంగాలు -

1973 నుండి జాగృతి, భారతి, నాట్యకళ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రచన, సమాలోచనమ్, గైర్వాణి, సుధర్మా, ఆత్మజ్యోతి, సంవిత్, సంస్కృత సమ్మేళనమ్ మొదలైన పత్రికలలో వచన కవితలు, విమర్శ వ్యాసాలు, శ్లోకాలు, నాటికలు ముద్రితాలు, బొమ్మలకొలువు - అసంపూర్ణ నవల - విద్యాజ్యోతిలో సీరియల్

1991 నుండి 'విశ్వ ధర్మ వాణి' పత్రికా సంపాదకత్వం

కుటుంబ వివరాలు:

శ్రీమతి : సులోచన

కుమార్తెలు : 1. మాధవి, BE (Hons) M.S
అల్లుడు : కావూరి శ్యామ్ సుందర్
మనవడు : శ్రీహర్ష
మనవరాలు : గాయత్రి

2. డా॥ సుషమ., M.B.B.S.,D.O
అల్లుడు : డా॥ ప్రవీణ్ కుమార్
మనవరాలు : వాహిని

అభీష్ట విషయాలు : 1. అధ్యయనం, అధ్యాపనం
2. ఆధ్యాత్మిక, అది భౌతిక జీవితాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అనుగుణంగా విశ్లేషణాత్మక పరిశీలన
3. ఆచరణ ప్రాధాన్యం